ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రాజన్న సిరిసిల్ల

5★★★ జిల్లా వార్తలు

ఆదివారం 17 నవంబరు 2024

పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

వేములవాడ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించనున్న గ్రూప్-3 పరీక్ష కేంద్రాల పరిధిలో బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 (144 సెక్షన్) అమలులో ఉంటుందని వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ శనివారం ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 (144 సెక్షన్) అమలు చేస్తున్నామని, పరీక్ష కేంద్రాల సమీపంలో ఉన్న జిరాక్స్ సెంటర్లు, ఇంటర్నెట్ కేంద్రాలను మూసి ఉంచాలని సూచించారు. పరీక్ష కేంద్రాల సమీపంలో లౌడ్ స్పీకర్లు వినియోగించరాదని వెల్లడించారు. పరీక్ష కేంద్రాలకు 500 మీటర్ల పరిధిలో ప్రజలు గుమిగూడవద్దన్నారు.



దీపాలు వెలిగిస్తున్న మహిళలు

రాజన్న ఆలయంలో కార్తీక సందడి

- తరలివచ్చిన భక్తులు
- దీపాలు వెలిగించిన మహిళలు

7



కోడెమొక్కు చెల్లించుకుంటున్న మంత్రి పొన్నం

ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారు

- పదేళ్ల గత ప్రభుత్వ హయాంలో రూ.7.5 లక్షల కోట్ల అప్పు
- మంత్రి పొన్నం ప్రభాకర్

7



మాట్లాడుతున్న విప్ ఆది శ్రీనివాస్

నేతన్నలు మార్కెట్‌తో పోటీ పడాలి

- 66 లక్షల మీటర్ల క్లాత్ ఆర్డర్లు
- 20న వేములవాడలో సీఎం సభ
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

7

న్యూస్ బాక్స్

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు విద్యార్థులు

ఇల్లంతకుంట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఇల్లంతకుంట మండలం వల్లంపట్ల జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దూస గోవర్ధన్, పీఈటీ సాబీర్ తెలిపారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన అథ్లెటిక్స్‌లో వల్లంపట్ల పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న విద్యార్థులు అనుప్రియ, మధుశ్రీ, గౌతమి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడంతో ప్రధానోపాధ్యాయుడితోపాటు ఉపాధ్యాయులు, మాజీ సర్పంచ్ కేతిరెడ్డి అనసూయ, మాజీ ఎంపీటీసీ స్రవంతి అభినందించారు.

ఆర్థిక సహాయం అందజేత



సహాయం చేస్తున్న సభ్యులు

వేములవాడ నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): శబరిమలకు పాదయాత్రగా బయల్దేరి మార్గమధ్యలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వేములవాడ పట్టణానికి చెందిన వంగపల్లి హరీశ్ కుటుంబానికి స్థానిక లయన్స్ క్లబ్ ప్రతినిధులు శనివారం రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేశారు. లయన్స్ క్లబ్ జెడ్‌సి మారం కుమార్, డిస్ట్రిక్ కో ఆర్డినేటర్ తీగల వెంకటేశ్వర్ రావు, చైర్మన్ శ్రీనివాస్, కోశాధికారి వెంకట కృష్ణ, లయన్స్ క్లబ్ సభ్యులు కౌన్సిలర్ నిమ్మశెట్టి విజయ్, గోలి మహేశ్, బాసెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లు.. కట్టుదిట్టం



- నేడు, రేపు గ్రూప్-3 పరీక్ష
- జిల్లాలో 25 కేంద్రాలు
- 7062 మంది అభ్యర్థులు
- కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే గ్రూప్ -3 పరీక్షలకు అధికార యంత్రాంగం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఆదివారం, సోమవారం రెండు రోజులు జరిగే మూడు పరీక్షలకు సంబంధించి అభ్యర్థులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టింది. సౌకర్యాలు కల్పించడంతోపాటు భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది. జిల్లాలో గ్రూప్-3 పరీక్షల కోసం జిల్లాలో 25 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో పురుషులకు 11, మహిళలకు 11, దివ్యాంగులకు 2, దివ్యాంగుల్లో ఇతరుల సహాయంతో రాయడానికి ఒక సెంటర్‌ను ఏర్పాటు చేశారు. జిల్లాలో మొత్తం 7062 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. ఇందులో పురుషులు 3701 మంది, మహిళలకు 3359 మంది అభ్యర్థులు ఉన్నారు. ఇందుకోసం పది రూట్లలో ఏర్పాట్లు పూర్తి చేశారు.

సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో 18 కేంద్రాలు, వేములవాడలో 7 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో ఐదు ప్రభుత్వ పాఠశాలలు, 7 ప్రైవేటు పాఠశాలలు, నాలుగు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అగ్రహారం పాలిటెక్నిక్ కళాశాలలు, అగ్రహారం డిగ్రీ కళాశాల, ఏడు ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో కేంద్రాలను ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే అభ్యర్థుల కోసం ప్రధాన కూడళ్ల వద్ద హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేశారు. సమాచారం కోసం హెల్ప్‌డెస్క్ సెల్ నంబర్లను అందుబాటులో ఉంచారు. పరీక్షల నిర్వహణలో 25 మంది అబ్జర్వర్స్, 25 మంది డిపార్ట్‌మెంట్ అధికారులు, 25 మంది సూపరింటెండెంట్‌లు, 5 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలతో పాటు పరీక్ష కేంద్రాల వద్ద బయోమెట్రిక్ కోసం 58 మంది, 75 మంది ఐడెంటిఫికేషన్ అధికారులను నియమించారు.

30 నిమిషాల ముందే గేట్ల మూసివేత

జిల్లాలో ఆది, సోమవారాల్లో జరిగే గ్రూప్-3 పరీక్షల్లో 30నిమిషాల ముందే గేట్లను మూసివేయనున్నారు. 17వ తేదీన మొదటి పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, రెండో పరీక్ష మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహించనున్నారు. పరీక్ష ప్రారంభానికి అరగంట ముందే గేట్లు మూసివేస్తారు. ఉదయం 9.30 గంటలకు, మధ్యాహ్నం 2.30 గంటలకు పరీక్ష కేంద్రాల గేట్లు మూసిన తర్వాత ఎవరినీ అనుమతించరు.

18వ తేదీన ఉదయం 10 గంటల నుంచి 12.30 వరకు పరీక్ష నిర్వహిస్తారు. అరగంట ముందే గేట్లు మూసి వేస్తారు. ఒక నిమిషం ఆలస్యమైనా అభ్యర్థులను అనుమతించరు. బయోమెట్రిక్ విధానం కూడా ఉండడంతో అభ్యర్థులు ముందే రావడం మంచిది. అభ్యర్థులు తమ వెంట హాల్‌టికెట్‌తోపాటు ఏదైనా ఒక ఒరిజినల్ గుర్తింపు కార్డు తెచ్చుకోవాలి. బయో మెట్రిక్ వేలి ముద్ర హాజరు ఉండడంతో మెహందీ, టాటూలు వేసుకొని రావద్దు.

మిగతా 8వ పేజీలో..

పురుగు మందుల విక్రయంలో నిబంధనలు పాటించాలి



దుకాణ యజమానులతో మాట్లాడుతున్న సీఐ వీరప్రసాద్

వేములవాడ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పురుగుల మందుల విక్రయంలో నిబంధనలను పాటించాలని వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ సూచించారు. వేములవాడ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఫర్టిలైజర్స్ దుకాణాల నిర్వాహకులతో శనివారం పోలీస్ స్టేషన్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తగిన ధృవీకరణ పత్రాలు ఉన్న రైతులకు మాత్రమే నిబంధనల మేరకు పురుగు మందులు విక్రయించాలన్నారు. పురుగు మందులు తాగి ఆత్మహత్యకు పాల్పడుతున్న సంఘటనలు నివారించేందుకు దుకాణాల యజమానులు సహకరించాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా పురుగు మందులు విక్రయించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్సైలు రమేశ్, అంజయ్య, దుకాణాల యజమానులు ఉన్నారు.

ఘనంగా లక్ష్మీనర్సింహస్వామి రథోత్సవం



స్వామివారి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

రుదంగి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రుద్రంగి మండల కేంద్రంలోని ప్రహ్లాద పర్వతంపై వెలిసిన లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం స్వామివారి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో స్వామివారికి మంగళహారతులతో స్వాగతం పలికారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్సై అశోక్ బందోబస్తు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ కోమిరె శంకర్, ఆలయ వైస్ చైర్మన్ దాసరి గంగారాజం, మాజీ జడ్పీటీసీ గట్ల మీనయ్య, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, రాజేశం, గండి నారాయణ, అభిలాష్, పిడుగు లచ్చిరెడ్డి, ఆకుల గగన్, దువ్వాక గంగాధర్, దయ్యాల శ్రీనివాస్ గడ్డం నారాయణ పాల్గొన్నారు.

మందుల నిల్వల తనిఖీ



ఆడిట్ చేస్తున్న స్టేట్ టాస్క్‌ఫోర్స్ టీం

తంగళ్లపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని స్టేట్ టాస్క్‌ఫోర్స్ టీం శనివారం సందర్శించింది. డిప్యూటీ డైరెక్టర్ కృష్ణవేణి ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ బృందం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని డ్రగ్స్‌కు సంబంధించిన రికార్డులను తనిఖీ చేసింది. ఆరోగ్య కేంద్రంలోని ప్రస్తుత మందుల నిల్వలు, వినియోగించిన తదితర అంశాలను పరిశీలించారు. జిల్లా వైద్యాధికారి వసంతరావు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్నేహ తదితరులు ఉన్నారు.

విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి



చెక్కు అందజేస్తున్న ఎక్సైజ్ శాఖ ఎస్సై ప్రణీత్‌కుమార్

సిరిసిల్ల టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : యువత, విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ లావణ్య అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణం మినీ స్టేడియంలో ఈశా ఆధ్వర్యంలో 16వ గ్రామోత్సవ్‌లో భాగంగా యువతీ, యువకులకు ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి వాలీబాల్, త్రో బాల్ పోటీలను మున్సిపల్ కమిషనర్ లావణ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువతి, యువకులకు క్రీడోత్సవాలను నిర్వహిస్తూ వారిలో ఉన్న క్రీడా నైపుణ్యాన్ని ప్రోత్సహిస్తున్నారని అన్నారు. క్రీడాకారులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా స్థాయి వాలీబాల్, త్రోబాల్ పోటీలు నిర్వహించారు. వాలీబాల్ పోటీలలో విజేతగా దుమాల జట్టు, రన్నరప్‌గా కొదురుపాక జట్టు, త్రో బాల్ (మహిళ) పోటీలలో విజేత జట్టుగా రాచర్ల గొల్లపల్లి, రన్నరప్ జట్టుగా కొత్తపల్లి జట్టు నిలిచాయి. త్రో బాల్ పోటీలలో విజేతగా రాచర్ల గొల్లపల్లి జట్టు, రన్నరప్ కొత్తపల్లి జట్టు నిలిచింది. సాయంత్రం బహుమతుల ప్రదాన కార్యక్రమానికి ముఖ్య అతిథి సిరిసిల్ల ఎక్సైజ్ శాఖ ఎస్సై ప్రణీత్‌కుమార్ హాజరయ్యారు. వాలీబాల్ విజేత దుమాల జట్టుకు నగదు రూ.9వేలు, రన్నరప్ జట్టు కొదురుపాకకు రూ.6వేలు, తృతీయ స్థానంలో నిలిచిన మానాల జట్టుకు రూ.5వేలు, నాలుగో స్థానంలో నిలిచిన వీర్నపల్లి జట్టుకు రూ.4వేలు చెక్కుతోపాటు బహుమతులను అందించారు. త్రో బాల్ పోటీలలో విజేత రాచర్ల గొల్లపల్లి జట్టుకు రూ.5 వేలు, రన్నరప్ జట్టు కొత్తపల్లి జట్టుకు రూ.3వేలు, తృతీయ స్థానంలో నిలిచిన బొప్పాపూర్ జట్టుకు రూ.1500 నాలుగో స్థానంలో నిలిచిన రంగంపేట జట్టుకు రూ.1500 చెక్కుతోపాటు బహుమతులను అందించి అభినందించారు. ఈశా సభ్యులు అనిల్, జయలేఖ, ప్రదీప్, దీక్షిత్, నాగరాజు, ఆకాష్, వర్ష, శ్రీతేజ, సంతోష్, సాయి, ఆచారి, శ్రావన్, నందకిషోర్ పాల్గొన్నారు.

సీఎం పర్యటన విజయవంతం చేయాలి

తంగళ్లపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జలగం ప్రవీణ్ పిలుపునిచ్చారు. శనివారం తంగళ్లపలి మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఈ నెల 20న అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొంటున్న ముఖ్యమంత్రి ,మంత్రులు, ఎమ్మెల్యేల పర్యటనతో పాటు అనంతరం నిర్వహించే బహిరంగ సభకు జన సమీకరణ తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం, అభివృద్ధిపై నాయకులు ప్రతీ బూత్‌లో పర్యటించి ప్రజలకు వివరించాలని, సభకు తరలివచ్చేలా చూడాలని అన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

తంగళ్లపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం నేరళ్ల గ్రామ శాఖ అధ్యక్షుడు కోల శంకర్, లక్ష్మీపురం గ్రామానికి చెందిన మిట్టపల్లి రాంరెడ్డి, మల్లారెడ్డిని శనివారం కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి పరామర్శించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్, వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ నర్సింగంగౌడ్, బ్లాక్ అధ్యక్షుడు సూర దేవరాజు, మండల నాయకులు కటకం రాజశేఖర్, శ్రీకాంత్ గౌడ్, భైరనేని రాము, భీమవరం శ్రీనివాస్, డైరెక్టర్లు కళ్లపల్లి తిరుపతిరెడ్డి, ఆరెపల్లి బాలు, గుగ్గిళ్ల రాములు, ఆనంద్, గ్రామ శాఖ అధ్యక్షుడు చందు ఉన్నారు.

ప్రజారోగ్యానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

వేములవాడ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రజల ఆరోగ్యానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీట వేస్తున్నదని వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలోని తన నివాసంలో శనివారం 41 మంది లబ్ధిదారులకు 13 లక్షల రూపాయల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణ విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తున్నదని, అందులో భాగంగానే ఆరోగ్యశ్రీ పరిమితిని 10 లక్షల రూపాయలకు పెంచామని అన్నారు. చికిత్స అవసరమైన వారికి ఎల్‌వోసీలు అందించే విషయంలో అంకితభావంతో పనిచేస్తున్నామని, చికిత్స కోసం డబ్బు ఖర్చు చేసిన పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందజేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేశ్, కౌన్సిలర్ ఇప్పపూల అజయ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సంద్రగిరి శ్రీనివాస్‌గౌడ్, నాయకులు చిలుక రమేశ్, పుల్కం రాజు, గూడూరి మధు పాల్గొన్నారు.

సిరిసిల్ల రూరల్: సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 9వ వార్డు బాబాజీ కాలనీకి చెందిన మోటం మంజులలింగయ్యకు మంజూరైన రూ.60 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును బుధవారం కాంగ్రెస్ నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి గంభీరావుపేట ప్రశాంత్‌గౌడ్, ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ మంగ కిరణ్‌కుమార్, నాయకులు చెన్నమనేని కమలాకర్‌రావు, మాజీ సర్పంచ్ ర్యాకం రమేష్, కాంగ్రెస్ ఓబీసీ సెల్ పట్టణ ప్రధాన కార్యదర్శి సలేంద్రీ వేణుగోపాల్‌యాదవ్, 8వ వార్డు యూత్ అధ్యక్షుడు నీరటి శ్యాం పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సమగ్ర అభివృద్ధే ధ్యేయం



సభాస్థలిని పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

- నెరవేరనున్న యారన్ డిపో కల
- వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

వేములవాడ కల్చరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాజన్న క్షేత్రంతోపాటు సిరిసిల్ల జిల్లా సమగ్రాభివృద్ధే ధ్యేయంగా సీఎం పర్యటన ఉంటుందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ఈ నెల 20వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో శనివారం హెలిప్యాడ్, సభ ప్రాంగణం, పార్కింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ సీఎం పర్యటనకు మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌తోపాటు పలువురు మంత్రులు రానున్నట్లు చెప్పారు. జిల్లాలోని నేత కార్మికుల 30 ఏళ్ల నూలు డిపో కల నెరవేరనుందన్నారు. శృంగేరి పీఠంవారి ఆదేశాల మేరకు బ్రాహ్మణోత్తములతో రాజన్న ఆలయ అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నట్లు చెప్పారు. పీసీసీ అధ్యక్షుడి హోదాలో వచ్చిన రేవంత్‌రెడ్డి నేడు సీఎం హోదాలో ఆలయానికి వచ్చి రాష్ట్రం సుభిక్షంగా ఉండేలా చూడాలని స్వామివారిని వేడుకుంటారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇటీవల ప్రకటించిన బడ్జెట్‌లో రాజన్న ఆలయ అభివృద్ధికి రూ. 50 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. సీఎం పర్యటనలో భాగంగా జిల్లా పోలీస్ కార్యలయం, యారన్ డిపోతోపాటు రాజన్న ఆలయ అభివృద్ధి పనులకు వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేస్తారన్నారు. ముగింపు దశకు చేరుకున్న శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు పనులకు సీఎం పర్యటనతో అడుగులు పడనున్నాయన్నారు. ఈ నెల 20వ తేదీన మధ్యాహ్నం 12 గంటలకు రాజన్న ఆలయ గుడి చెరువు ప్రాంగణంలో సీఎం బహిరంగ సభ ఉంటుందని, జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర దేవదాయ, జౌళి శాఖ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్, దేవాదాయశాఖ కమిషనర్ శ్రీధర్, టూరిజం శాఖ ఎండీ హనుమంతు, కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్, దేవాదాయ శాఖ స్థపతి వల్లి నాయగం, ఈవో వినోద్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



మ్యాప్‌ను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్

క్రైం కార్నర్

వేర్వేరు చోట్ల ముగ్గురి ఆత్మహత్య

ఉమ్మడి జిల్లా పరిధిలో వేర్వేరు చోట్ల శనివారం ముగ్గురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. జగిత్యాల జిల్లా వెల్గటూర్‌లో వివాహం కావడం లేదని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఉండే యువకుడు అప్పుల బాధ, కుటుంబ కలహాలతో ఉరివేసుకున్నాడు. పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం పన్నూర్ గ్రామపంచాయతీ పరిధిలోని వకీల్‌పల్లె పునరావాస కాలనీకి చెందిన వ్యక్తి అనారోగ్యంతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

● వివాహం కావడం లేదని యువకుడి ఆత్మహత్య


మహేందర్(ఫైల్)

వెల్గటూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వివాహం కావడం లేదని మనస్తాపం చెందిన ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య కు పాల్పడ్డాడు. ఎస్సై ఉమాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. వెల్గటూర్ మండలం స్తంభంపల్లి గ్రామానికి చెందిన జక్కుల మహేందర్ (35) అనే యువకుడు శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మహేందర్ వ్యవసాయం చేసుకుంటూ జీవించేవాడు. కొన్నేళ్లుగా వివాహ ప్రయత్నాలు చేస్తున్నా సంబంధం కుదరడం లేదు. దీంతో మనస్తాపం చెందిన మహేందర్ శుక్రవారం అర్ధరాత్రి పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు అతడిని కరీంనగర్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. తన మృతికి ఎవరు కారణం కాదని వివాహం కాకపో వడం వల్ల జీవితంపై విరక్తితో చనిపోతున్నానంటూ సూసైడ్ నోట్‌లో రాశాడు. మహేందర్ సోదరుడు జక్కుల రాజేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

● అప్పుల బాధ, కుటుంబ కలహాలతో..


జగదీష్(ఫైల్)

తిమ్మాపూర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): అప్పులబాధ, కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎల్ఎండీ ఎస్సై వివేక్, యువకుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం తాళ్లపేట గ్రామానికి చెందిన దామనపల్లి జగదీష్(34)అనే యువకుడు కొంత కాలంగా కరీంనగర్‌లోని సీతారాంపూర్‌లో భార్యతో కలిసి ఉంటున్నాడు. ఆటో నడుపుకుంటు జీవనం కొనసాగిస్తున్నాడు. కుటుంబ అవసరాల నిమిత్తం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ బ్యాంకులో జగదీష్ పర్సనల్ లోన్ తీసుకున్నాడు. వాయిదాలు సరిగా చెల్లించకపోవడంతో బ్యాంక్ అధికారులు జగదీష్‌ను డబ్బులు కట్టాలని డిమాండ్ చేస్తున్నారు. జగదీష్‌కు రెండేళ్ల క్రితమే వివాహం జరిగింది. కొన్ని రోజులుగా జగదీష్‌కు భార్యతో గొడవలు జరుగుతున్నాయి. ఓ వైపు లోన్ కట్టాలని బ్యాంకు సిబ్బంది. మరో వైపు భార్య నుంచి వేధింపులు ఎక్కువ కావడంతో ఈనెల 13వ తేదీన జగదీష్ ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి జగదీష్ ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు గాలిస్తున్నారు. శనివారం కరీంనగర్ కార్పొరేష న్ పరిధిలోని అలుగునూర్ శివారులోని కాకతీయ కాలువ సమీపంలో చెట్ల పొదల్లో చెట్టుకు ఉరివేసుకున్న జగదీష్ మృతదేహం కనిపించింది. పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై తాండ్ర వివేక్, బ్లూకోల్ట్స్ సిబ్బంది నరేష్, లక్ష్మీనారాయణ అక్కడికి చేరుకుని వివరాలు తెలుసు కున్నారు. జగదీష్ వద్ద లోన్ కోసం బ్యాంకు అధికారి, భార్య వేధింపులు తట్టుకోలేకనే ఆత్మహత్యకు పాల్పడినట్లు సూసైడ్ నోట్ లభించింది. జగ దీష్ అన్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివేక్ తెలిపారు.

● అనారోగ్యంతో వ్యక్తి ..

కమాన్‌పూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో కలత చెంది రామగిరి మండలం పన్నూర్ గ్రామపంచాయతీ పరిధిలోని వకీల్‌పల్లె పునరావాస కాలనీకి చెందిన మోత్కూరి శ్రీనివాస్(55) అనే వ్యక్తి శుక్రవారం రాత్రి కమాన్‌పూర్ మండలంలోని జూలపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ముల్కలపల్లి గ్రామ శివారులోని రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఉన్న చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు, బంధువులు శ్రీనివాస్ ఆచూకీ కోసం గాలించగా చెట్టుకు ఉరేసుకున్నట్లు సమాచారం అందింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొట్టే ప్రసాద్ తెలిపారు.

అట్రాసిటీ కేసుపై ఏసీపీ విచారణ

జమ్మికుంట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంటలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీకేసుపై హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ శనివారం విచారణ చేపట్టారు. పట్టణంలోని పద్మశాలి వీధిలో నివాసం ఉంటున్న ఈర్ల రజితను తమ ఇంటి పక్కన ఉండే వ్యక్తి అయిన మడిపల్లి అనిల్ కులం పేరుతో దూషించాడని బాధిత మహిళ ఫిర్యాదు చేసింది. నగురం గ్రామానికి చెందిన కవ్వంపల్లి లలితను అదే గ్రామానికి చెందిన పాశికంటి రాణి-తిరుపతిలు దూషించారని ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టారు. ఏసీపీ వెంట ఎస్సై ఆరోగ్యం, సిబ్బంది ఉన్నారు.

వరి కొయ్యలు కాల్చొద్దు..

● కలియదున్నితే మేలు


పోతిరెడ్డిపేటలో వరికొయ్యలకు నిప్పు పెట్టిన రైతు

హుజూరాబాద్‌రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వరి కొయ్యల దహనంతో భూమి సారం కోల్పోతుందని వ్యవసాయాధికారులు అంటున్నారు. కొయ్యలకు నిప్పు పెట్టే బదులు, వాటిపై సూపర్ పాస్పేట్ చల్లితే 15 రోజుల్లో కొయ్య మురిగి భూమికి పోషకాలు అందుతాయి. దీంతో ఎరువుల ఖర్చు తగ్గి రైతులకు పెట్టుబడి ఆదా అవుతంది. రైతులు ఎప్పటికప్పుడు వ్యవసాయాధికారుల సూచనలు తీసుకుంటే పంటల ఖర్చు తగ్గడంతోపాటు అధిక దిగుబడిని సాధించవచ్చు. రైతులు ప్రస్తుతం యాసంగి సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఎక్కువ మంది రైతులు హార్వెస్టర్లతో వానాకాలం పొలాలను కోశారు. దీంతో వరి కొయ్యలు కాస్త పెద్దవిగా ఉంటాయి. ఈ కొయ్యలను తొలగించేందుకు ఖర్చవుతుందని భావించిన రైతులు మంట పెట్టి కాల్చేస్తున్నారు. దీంతో విపరీతమైన వేడివల్ల భూమిసారం కోల్పోతుంది. వరి కొయ్యలను కలియ దున్నడం వల్ల సేంద్రియ కార్బన్ శాతం పెరుగుతుంది. దుక్కి దున్నేప్పుడు సూపర్ పాస్పేట్ చల్లితే రెండు వారాల్లో కర్ర మురిగుతుంది. భూమికి పోషకాలు అంది డీఏపీ వాడకం సగం వరకు తగ్గుతుంది. ఖర్చులు ఆదా అవుతాయి. కలియ దున్నితే ఎకరాకు టన్ను ఎరువు తయారవుతుంది.

● నష్టాలెన్నో..

వరి కొయ్యలు కాల్చితే వేడితో భూమిలోని నైట్రోజన్, పాస్పరస్, పొటాషియం వంటి పోషకాలు ఆవిరవుతాయి. మట్టిలోని సూక్ష్మ జీవులు దెబ్బతింటాయి. నీటి నిల్వ సామర్థ్యం తగ్గుతుంది. కాల్చగా వచ్చిన పొగతో వాతావరణం దెబ్బతింటుంది.

అవగాహన కల్పిస్తున్నాం..

- పొద్దుటూరి సతీష్, ఏఈవో, సిర్సపల్లి క్లస్టర్



రైతులకు వరికొయ్యల కాల్చివేతపై అవగాహన కల్పిస్తున్నాం. అయినా కొంత మంది రైతులు కొయ్యలు కాల్చి వేస్తున్నారు. వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటిస్తే రైతులకు సాగు ఖర్చు తగ్గడంతో పాటు దిగుబడి పెరుగుతుంది. రైతులకు ఎలాంటి సమస్యలున్నా మమ్మల్ని సంప్రదించాలి. యాసంగి సాగులో రైతులు జింక్‌ను వాడితే పంటలకు ఎంతో మేలు.

'జులాయి'లపై పోలీసుల కొరడా

- అర్ధరాత్రి స్పెషల్ డ్రైవ్

- 23 బైక్‌లు, కారు, ఆటోల సీజ్


బస్టాండ్‌లో ఉన్న వ్యక్తిని షెల్టర్‌హోంకు తరలిస్తున్న పోలీసులు

కరీంనగర్ క్రైం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కొందరు యువకులు అర్ధరాత్రి సమయాల్లో కరీంనగర్‌లోని పలు ప్రాంతాల్లో తిరుగుతూ గొడవలు పడడం, ప్రయాణికులకు ఇబ్బందులు కలిగిస్తున్నారనే ఫిర్యాదులతో కరీంనగర్ ఒకటో ఠాణా సీఐ బిల్ల కోటేశ్వర్ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం అర్ధరాత్రి నగరంలోని పలు ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రోడ్లపై జులాయిగా తిరుగుతున్న 30 మందిని పట్టుకుని 23 బైక్‌లు, రెండు ఆటోలు, ఒక కారును సీజ్ చేసి ఠాణాకు తరలించారు. రోడ్లపై నిద్రిస్తున్న 20 మంది అనాథలను గుర్తించి షెల్టర్ హోంకు తరలించారు. ఆర్టీసీ బస్టాండ్, ఇందిరాచౌక్, ఎన్టీఆర్ చౌరస్తా, తీగల వంతెన ప్రాంతం, కమాన్, మార్కెట్ ఏరియాల్లో శుక్రవారం రాత్రి నుంచి శనివారం వేకువజాము వరకు వాహనాల తనిఖీలు, డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు, ఫింగర్‌ప్రింట్ డివైజ్‌తో వేలిముద్రల సేకరణ తనిఖీలు కొనసాగాయి. శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా పోలీసులు రాత్రి సమయాల్లో ప్రతి రోజు పెట్రోలింగ్‌తో పాటు ఆకస్మిక తనిఖీలను ముమ్మరం చేయాలని నగర వాసులు కోరుతున్నారు.

నగల షాపుల్లో దొంగల బీభత్సం

- రెండు దుకాణాల్లో 34 తులాల వెండి అపహరణ


మల్లాపూర్‌లో చోరీ చేసిన నగల దుకాణం

మల్లాపూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మల్లాపూర్ మండల కేంద్రంలో గుర్తు తెలియని వ్యక్తులు నగల దుకాణాల్లో చోరీకి పాల్పడ్డారు. శుక్రవారం అర్ధరాత్రి మల్లాపూర్‌లోని రెండు నగల దుకాణాల తాళాలు పగుల గొట్టి 34 తులాల వెండి ఆభరణాలు అపహరించారని ఎస్సై కిరణ్‌కుమార్ శనివారం తెలిపారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం...మండల కేంద్రానికి చెందిన బెజ్జారపు గంగాధర్, తుమ్మనపల్లి శ్రీనివాస్‌లకు సంబంధించిన నగల దుకాణాలకు శుక్రవారం రాత్రి షటర్స్ మూసి తాళాలు వేసి ఇంటికి వెళ్లారు. శనివారం ఉదయం ఇద్దరు షాపు యజమానులు వచ్చి చూసే సరికి వేసిన తాళాలు పగులగొట్టి ఉన్నాయి. వెంటనే షటర్స్ తెరిచి చూసేసరికి వస్తువులన్నీ చిందర వందరగా పడి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని పరిశీలించారు. బాధితులు షాపులలో 34 తులాల వెండి ఆభరణాలు దొంగిలించినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు క్లూస్ టీంతో గాలింపు చర్యలు చేపట్టారు. అదే విధంగా సమీపంలోని ఓ ఇంట్లోనూ నిందితులు చోరీకి యత్నించినట్లు గ్రామస్థులు తెలిపారు.

గంజాయి కేసులో ఇద్దరి రిమాండ్


మాట్లాడుతున్న సీఐ వరుగంటి రవి

వీణవంక నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గంజాయి కేసులో ఇద్దరిని రిమాండ్‌కు తరలించామని సీఐ వరుగంటి రవి అన్నారు. పోలీస్‌స్టేషన్‌లో ఆయన శనివారం వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండలంలోని రెడ్డిపల్లి గ్రామ శివారులోని ప్రాథమిక పాఠశాల సమీపంలో ఘన్ముక్ల గ్రామానికి చెందిన బొంగోని పవన్ సాయి, నర్సింగాపూర్‌కు చెందిన బుర్ర శ్రీనాథ్ అనుమానాస్పదంగా కనిపించగా పోలీసులు వారి బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వారి వద్ద కిలో 135 గ్రాముల గంజాయి పట్టుపడింది. వీణవంక పోలీసులు ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. నార్కోటిక్ పోలీసుల సూచన మేరకు పట్టుబడిన గంజాయి సీజ్ చేసి ఇద్దరి యువకులపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించారు. నిందితులు మహారాష్ట్రలోని బల్లార్షా నుంచి గంజాయి తక్కువ ధరకు తీసుకువచ్చి చిన్న ప్యాకెట్స్ చేసి రెట్టింపు ధరకు విక్రయిస్తునట్లు పోలీసుల విచారణలో తేలింది. పట్టుబడిన గంజాయి విలువ 22,000 వేల రూపాయలు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ తోట తిరుపతి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరు మహిళల మృతికి కారకుడైన కారు డ్రైవర్ అరెస్ట్


విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న సీఐ ప్రవీణ్‌కుమార్

పెద్దపల్లిటౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మహిళల మృతికి కారకుడైన డ్రైవర్‌ను అరెస్ట్ చేసినట్లు సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా తన కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడారు. ఈనెల 12 రంగంపల్లిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నలుగురు మహిళలు కూలీ పనులు ముగించుకొని ఇంటికి తిరిగివస్తున్న క్రమంలో వెనుకాల నుంచి కారు ఢీకొట్టిన ప్రమాదంలో ఉదయ్‌నగర్‌కు చెందిన కుక్క అమృత, కుక్క భాగ్యలు అక్కడికక్కడే మృతిచెందగా, కుక్క పద్మ, కుక్క కాంతమ్మలకు గాయాలయ్యాయి. ఈ ఘనటలో కారుతో పాటు డ్రైవర్ పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై లక్ష్మణ్‌రావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. ఏసీపీ గజ్జి కృష్ణ సూచనల మేరకు మూడు బృందాలను ఏర్పాటుచేసి కారు కోసం తీవ్రంగా గాలించినట్లు తెలిపారు. విచారణలో భాగంగా పోలీసులకు అందిన పక్కా సమాచారంతో యాక్సిడెంట్ చేసిన కారును అప్పన్నపేట గ్రామంలో దాచి సాక్ష్యాధారాలను మార్చేందుకు కారును మరమ్మతులు చేయించడానికి తీసుకువెళతున్నారని తెలుసుకున్న పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. పోతారం గ్రామానికి చెందిన డ్రైవర్ చల్ల పవన్‌కళ్యాణ్, రాజేందర్‌ను అరెస్ట్ చేసినట్లు సీఐ వివరించారు. కేసును ఛేదించిన సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సై లక్ష్మణ్‌రావు, సిబ్బందిని ఏసీపీ కృష్ణ అభినందించారు.

ఖననం చేసిన శిశువు మృతదేహానికి పోస్టుమార్టం

హుజూరాబాద్‌రూరల్, నవంబరు 16(ఆంధ్యజ్యోతి): అధికారులు ఖననం చేసిన శిశువు మృతదేహానికి శనివారం పోస్టుమార్టం నిర్వహించారు. పట్టణంలోని బుడుగజంగాల కాలనీకి చెందిన రాజేశ్వరి కూతురి కళ్లెం లక్ష్మి ప్రసవం కోసం ప్రభుత్వాసుపత్రికి ఈ గురువారం రాత్రి వచ్చింది. వైద్యులు ఆమెకు ఆపరేషన్ చేయడంతో ఆడ శిశువు పుట్టింది. అనంతరం శిశువుకు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉందని, కరీంనగర్‌కు తీసుకెళ్లాలంటూ వైద్యులు సూచించారు. వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స కోసం కరీంనగర్‌కు తరలి స్తుండగా మార్గ మధ్యలో శిశువు మృతి చెందింది. మృతి చెందిన ఆడ శిశువు మృతదేహాన్ని శుక్రవారం ఉదయం కుటుంబ సభ్యులు ఇప్పలనర్సింగాపూర్ గ్రామ శివారులో ఖననం చేశారు. శిశువు మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ ఆస్పత్రి ఎదుట కుటుంబ సభ్యులు, బాధితురాలు ఆందోళ నకు దిగారు. వైద్యులపై చర్యలు తీసుకోవాలంటూ లక్ష్మి తల్లి రాజేశ్వరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. శిశువు మృతిపై కేసు నమోదు కాగా శనివారం ఖననం చేసిన శిశువుకు కాకతీయ వైద్య కళాశాల నుంచి వచ్చిన ప్రొఫెసర్ డాక్టర్ సురేందర్‌రెడ్డి తహసీల్దార్ కనుకయ్య, సీఐ తిరుమల్‌గౌడ్ పర్యవేక్షణలో పోస్టుమార్టం చేశారు. పోస్టుమార్టం నివేదికను ఉన్నతాధికా రులకు సమర్పించనున్నట్లు తెలిపారు.

పోలీసుస్టేషన్‌లో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

చొప్పదండి , నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి పట్టణానికి చెందిన కల్లెపల్లి ఆనంద్ (45) అనే వ్యక్తి శనివారం పోలీసుస్టేషన్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే పోలీసులు చికిత్స నిమిత్తం కరీంనగర్ లోని ఆస్పత్రికి తరలించారు. కల్లేపల్లి ఆనంద్ అనే వ్యక్తికి సంబంధించిన ఇంటి వద్ద పొరుగు వ్యక్తి గోడ నిర్మాణం చేపట్టాడని, ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని సీపీకి ఆనంద్ భార్య శనివారం ఫిర్యాదు చేసింది. సీఐకి ఫిర్యాదును అందజేయాలని చెప్పగా ఆనంద్ భార్య కూతురుతో చొప్పదండి పోలీసు స్టేషన్‌కు వచ్చాడు. తనకు పోలీసులు న్యాయం చేయడం లేదంటూ వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగాడు. సిబ్బంది ఆనంద్‌ను అడ్డుకొని ఆస్పత్రికి తరలించారు.

రేణుక ఎల్లమ్మ ఆలయంలో చోరీ

కమాన్‌పూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పిల్లిపల్లెలోని రేణుక ఎల్లమ్మ ఆలయంలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఆలయంలోని అమ్మవారి మెడలో ఉన్న సుమారు రూ. 20 వేలు విలువ చేసే పుస్తెలు అపహరణకు గురయ్యాయి. ఆలయంలో రాత్రి పెద్దఎత్తున శబ్దాలు రావడంతో సమీప ఇళ్లలోని ప్రజలు ఆలయ పూజారికి సమాచారం అందించారు. గౌడ కులస్థులు గుడి వద్దకు చేరుకోగా ఆలయంలో విద్యుత్తు సరఫరా నిలిపివేసి చోరీకి పాల్పడినట్లు తెలిసింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలం వద్దకు చేరుకొని గాలింపు చర్యలు చేపట్టగా ఆధార్‌కార్డు, సెల్‌ఫోన్ లభ్యమయ్యాయి. ఎస్ఐ కొట్టే ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు సమగ్ర దర్యాప్తు జరుపుతున్నారు.

మంథని To మహారాష్ట్ర


మంథనిలో ఇటీవల పట్టుకున్న రేషన్‌బియ్యం నిల్వలు

- **జోరుగా రేషన్ బియ్యం అక్రమ దందా**
- **రాజకీయ నేతల అండ.. అధికారులపై ఒత్తిళ్లు..**

మంథని, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సబ్సిడీపై పంపిణీ చేస్తున్న రే షన్ బియ్యం మంథని ప్రాంతంలో పక్కదారి పడుతున్నాయి. రేషన్ బియ్యం కొందరు అక్రమార్కులకు, రేషన్ డీలర్లకు వరంగా మారింది. స్థానికంగా ప్రజాపంపిణీ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి వాటిని రాష్ట్ర సరిహద్దులు దాటించి పక్క రాష్ట్రంలో అధిక మొత్తానికి విక్రయిస్తున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా యథేచ్ఛగా పెద్దఎత్తున రేషన్ బియ్యాన్ని సేకరించి ఇళ్లలో అక్రమంగా నిల్వ చేయడం, ఆ తర్వాత వాహనాల్లో గుట్టు చప్పుడు కాకుండా తరలిస్తున్నారు. కొందరు రాజకీయ నాయకుల, అధికారుల అండ దండలతోనే ఈ దందాను నిర్వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కాగా మంథని నియోజక వర్గ సరిహద్దుల్లో ఉన్న మహారాష్ట్రలో రేషన్ బియ్యానికి డిమాండ్ ఉండటాన్ని ఆసరా చేసుకొని కొందరు వ్యాపారులు, రాజకీయ నాయకులు, రేషన్ బియ్యం డీలర్లు వాటిని సేకరిస్తూ అక్రమంగా తరలించి లక్షల్లో సంపాదిస్తున్నారు.

● వినియోగదారుల నుంచే కొనుగోళ్లు..

ఇటీవల పట్టుబడిన కొన్ని వాహనాల్లో నేరుగా ప్రభుత్వం నుంచి రేషన్ డీలర్లకు వచ్చిన గన్నీ బ్యాగుల్లోనే అక్రమ రవాణాకు పాల్పడుతూ చిక్కారంటే రేషన్ డీలర్లు, గోదాంలపై రెవెన్యూ, సివిల్ సప్లై అధికారుల పర్యవేక్షణ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. మంథని పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లోని కొందరు డీలర్లు వినియోగదారుల బయోమెట్రిక్ ద్వారా బియ్యాన్ని పంపిణీ చేసి తిరిగి వారి వద్దనే కిలోకు రూ.8-10 వరకు కొనుగోలు చేస్తున్నారు. బియ్యాన్ని అక్రమంగా తరలించే ముఠాదారులకు రూ.12-15 వరకు విక్రయిస్తున్నారు. వారు మహారాష్ట్రలో కిలోకు రూ. 25-30 వరకు అక్కడి వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ఇలా ఎవరికి వారుగా అందినంత దండుకుంటున్నారు.

అక్రమ దందాలో రాజకీయ నాయకులు..

గతంలో కొందరు వ్యాపారులు రేషన్ బియ్యం అక్రమ రవాణా దందాను నిర్వహించి లక్షలు సంపాదించారు. అదిచూసిన కొందరు రాజకీయ నాయకులు సైతం రేషన్ బియ్యం స్మగ్లర్లుగా అవతారం ఎత్తారు. తమ నేతల అండదండలతో పట్టపగలే వాహనాల్లో రేషన్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అధికారులు నిఘా పెట్టి పట్టుకున్నా తర్వాత కేసుల విషయంలో, వాహనాలను విడిపించడంలో రాజకీయ నేతలు ఒత్తిళ్లు ఎక్కువగా ఉంటున్నాయని అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటికైనా జిల్లాస్థాయి ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి రేషన్ బియ్యం అక్రమ దందాను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని మంథని ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

● ప్రజలకు పంపిణీ చేయకుండా..

మంథని పట్టణంలోని రెండు చోట్ల, మండలంలోని సిరిపురం బ్యారేజీ వద్ద గత వారం రోజులలో పోలీసులు, సివిల్ సప్లై శాఖ అధికారులు తనిఖీలు చేయగా సుమారు 50 క్వింటాళ్ల బియ్యం పట్టుబడ్డాయి. కొద్ది నెలల క్రితం సైతం పట్టణ శివారు, మండలంలో నెల రోజుల వ్యవధిలోనే 4 వేర్వేరు సంఘటనల్లో రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తూ వాహనాలు పట్టుబడడం గమనార్హం. ఈ ఘటనల్లో దాదాపు 150 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. తాజాగా ఈనెల 9వ తేదీన మండలంలోని సిరిపురం గోదావరినది బ్రిడ్జి వద్ద ఒక వాహనంలో 25 బస్తాల్లో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు, సివిల్ సప్లై శాఖ అధికారులు పట్టుకొని గోదావరిఖనికి చెందిన శ్రీమోనుగుప్తాపై కేసు నమోదు చేసి వాహనాన్ని, బియ్యాన్ని సీజ్ చేశారు. గత ఆదివారం మంథని పట్టణంలోని మందాట ఏరియాలో చల్ల నారాయణ ఇంట్లో అధికారులు తనిఖీలు చేయగా 2 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకొని అతనిపై కేసు నమోదు చేశారు. స్థానిక శ్రీపాదకాలనీలోని బోగె సర్వేశ్ ఇంట్లో పోలీసులు, సివిల్ సప్లై అధికారులతో కలిసి శుక్రవారం తనిఖీలు నిర్వహించగా 16 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని 40 ప్లాస్టిక్ బ్యాగుల్లో అక్రమంగా నిల్వ ఉంచినట్లు గుర్తించారు. మండలంలోని పలు గ్రామాల్లో రేషన్ లబ్ధిదారుల నుంచి, మంథనిలోని రేషన్ డీలర్ గుండా ధనలక్ష్మి నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి మహారాష్ట్రలో ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు, రేషన్ డీలర్ గుండా ధనలక్ష్మి తన షాప్ నుంచి 7 క్వింటాళ్ల పీడీఎస్ రైస్‌ను లబ్ధిదారులకు ఇవ్వకుండా తనకు అమ్మినట్లు సర్వేష్ వెల్లడించాడు. ఈ మేరకు సర్వేష్, డీలర్ గుండా ధనలక్ష్మిపై కేసులు నమోదు చేశారు.

స్కూటీ డిక్కీనుంచి లక్ష రూపాయలు అపహరణ


సీసీ ఫుటేజీలో నమోదైన చిత్రం

కోరుట్ల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణ నడిబొడ్డు జన సంచారాల మధ్య సినీ ఫక్కీలో చోరీ జరిగింది. నిమిషాల వ్యవధిలో స్కూటీ డిక్కీలో నుంచి లక్ష రూపాయలు అపహరణకు గురి కావడం చర్చనీయాంశంగా మారింది. శనివారం మండలంలోని అయిలాపూర్ గ్రామానికి చెందిన కొల వెంకట రమణ అనే వ్యాపారి పట్టణంలోని ఎస్‌బీఐ బ్రాంచ్‌లో రూ. లక్ష నగదును డ్రా చేసుకుని తన స్కూటీ డిక్కీలో పెట్టుకున్నాడు. అక్కడి నుంచి పక్కనే ఉన్న గాంధీ రోడ్డులోని ఓ కిరణ దుకాణంలో సరుకులు తీసుకోవడానికి వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపి వెళ్లాడు. అప్పటికే అతడిని అనుసరిస్తున్న ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు అక్క డకు చేరుకుని స్కూటీ డిక్కీ తెరిచి అందులో ఉన్న రూ. లక్ష నగదు అపహరించి అక్కడి నుంచి పరారయ్యారు. డబ్బులు తీస్తున్న విషయం కిరాణం దుకాణంలో పని చేస్తున్న గుమాస్తా గమనించి వెంకట రమణకు తెలిపే లోపే చోరీ జరిగిపోయింది. దుకాణదారులతో కలిసి నిందితులను వెతికే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. వెంటనే వ్యాపారులు కోరుట్ల పోలీసులకు సమచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సీసీ ఫుటేజ్‌లను పరిశీలించారు. వ్యాపారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

రేషన్ బియ్యం పట్టివేత

సిరిసిల్ల క్రైం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని చంద్రంపేట శివారులో శ్రీలక్ష్మీఇండస్ట్రీస్‌లో విక్రయిస్తున్న ఎనిమిది క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని శనివారం రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నట్లు టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. కోనరావుపేట మండలంలోని నిజామాబాద్‌కు చెందిన చిత్తారి రమేశ్(29) అనే వ్యక్తి చుట్టుపక్కల గ్రామాలలో సేకరించి శ్రీలక్ష్మీఇండస్ట్రీస్‌లో విక్రయిస్తుండగా దాడులు చేసినట్లు తెలిపారు. బియ్యంతోపాటు ట్రాలీ ఆటో సీజ్ చేశామని, శ్రీలక్ష్మీఇండస్ట్రీస్ యజమానిపై, బియ్యం విక్రయిస్తున్న చిత్తారి రమేశ్‌పై కేసు నమోదు చేశామని తెలిపారు.

నీటి సంపులో పడి వృద్ధురాలు మృతి

శంకరపట్నం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కాచాపూర్ గ్రామంలో ఓ వృద్ధురాలు శనివారం నీటి సంపులో పడి మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం దాసరి కనకమ్మ (80) భర్త లేకపోవడంతో తన బాగోగులు ఇద్దరు కొడుకులు వెంకటేశ్వర్లు, సదానందం చూసుకుంటున్నారు. శనివారం కనకమ్మ ఇంటి ముందున్న నీటి సంపులో ప్రమాదవశాత్తు పడి మృతి చెందింది.

ధర్మపురిలో కార్తీక రద్దీ



గోదావరి నది వద్ద గంగా హారతి పూజలు చేస్తున్న అర్చకులు

ధర్మపురి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ధర్మపురిలో శనివారం కార్తీక భక్తుల రద్దీ పెరిగింది. అనుబంధ ఆలయాలు భక్తులతో కిట కిటలాడాయి. గోదావరి నదిలో కార్తీక స్నానాలు ఆచరించారు. భక్తులు ఆలయాలకు చేరుకుని అభిషేకాది పూజలు, కుంకుమార్చన, నరసింహ హోమం, స్వామి వారల నిత్య కళ్యాణం జరిపించి పూజలు చేశారు.. స్వామి వారలకు ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, వేదపారాయ ణదారు పాలెపు ప్రవీణ్‌శర్మ నిత్య పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, సూప రింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, పాల్గొన్నారు..

● ధర్మపురి క్షేత్రంలో 15 రోజు శనివారం గోదావరి హారతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు, అర్చకులు, సిబ్బంది గోదావరి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి హారతి కార్యక్రమం నిర్వహించారు.

వైభవంగా సామూహిక దీపోత్సవం



కళాభవన్‌లో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

వేములవాడ కల్చరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి క్షేత్రంలో ఏర్పాటు చేసిన సామూహిక కార్తీక దీపోత్సవం వైభవంగా కొనసాగుతోంది. రాజన్న ఆలయ కళావేదికలో ఏర్పాటు చేసిన దీపోత్సవాన్ని ఆలయ ముఖ్య అర్చకుడు గోపన్నగారి చందు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్తులు దీపాలను వెలిగించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆలయ కళాభవన్‌లో ఏర్పాటు చేసిన చిందు యక్షగానము భక్తులను ఆకట్టుకుంది. కార్తీక మాసం సందర్భంగా శనివారం రాజన్నను 36 వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయాధికారులు తెలిపారు.



ఆరోగ్యం కోసం విటమిన్లు

అందమైన జీవితానికి మంచి ఆహారం

● మానసిక, శారీరక ఆరోగ్యంలో ముఖ్యపాత్ర

మనిషి జీవితంలో విటమిన్ల ప్రాధాన్యం ఎంతో ఉంది. రోజుకో విటమిన్ ఉండే ఆహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చని న్యూట్రీషియన్లు చెబుతున్నారు. వివిధ రకాల పరిశోధనల తర్వాత 13 రకాల విటమిన్లు ఉంటాయని కనుగొన్నారు. మానవుల శారీరక, మానసిక ఆరోగ్యానికి విటమిన్లే ముఖ్య పాత్ర పోషిస్తాయని గుర్తించారు. ఆయా విటమిన్లు ఉండే పదార్థాలు, వాటి వల్ల చేకూరే ప్రయోజనాలు తెలుసుకుందాం.

◆ ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల

● విటమిన్ 'ఎ'

విటమిన్ 'ఎ' వల్ల కంటి చూపు, రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. ఎముకల శారీరక ఆరోగ్యం కూడా మెరుగు పడుతుంది. విటామిన్ ఎ తక్కువైతే రే చీకటి, దృష్టిలోపం, శరీరం పొడిబారడం వంటివి జరుగుతాయి. ఈ విటమిన్‌ను పొందాలంటే కోడి గుడ్డులో తెల్లసొన, లివర్, నెయ్యి, పాలు, చీజ్, నారింజ, పుచ్చకాయ, తోట కూర, క్యారెట్, పాలు, పాలకూర తీసుకోవాలి.

● విటమిన్ 'బి1'

విటమిన్ 'బి1' లోపం వల్ల మతిమరుపు, పెరుగుదలపై ప్రభావం, బరువు తగ్గడం, పక్షవాతం, రే చీకటి, వచ్చే అవకాశాలు ఉన్నాయి. 'బి1' వల్ల నరాలు, గుండె మెరుగైన పనితీరు, కండరాల పటుత్వం పెరుగుతుంది. అన్ని రకాల ధాన్యాలు, ఆకు కూరలు, డ్రై ఫ్రూట్స్, పల్లీలు, చేపలు, రొయ్యలతో 'బి1' విటమిన్ లభిస్తుంది.

విటమిన్ 'బి2'

విటమిన్ 'బి2'తో జీవనాడి వ్యవస్థ పెరుగుదల సక్రమంగా ఉంటుంది. కంటి చూపు మెరుగవుతుంది. కణజాల వ్యవస్థ అభివృద్ధి చెందుతుంది. బీ2 లోపంతో పెదాలు, నాలుక, నోటి మూలల్లో కురుపులు, జీర్ణ సంబంధిత సమస్యలు వస్తాయి. ఎక్కువైతే మూత్ర సంబంధిత సమస్యలు ఉంటాయి. పాలు, పాల ఉత్పత్తులు, మాంసం, కోడి గుడ్లు, కాలేయం, ఆకు కూరలు, పచ్చని ధాన్యాల నుంచి పొందవచ్చు.

విటమిన్ 'బి3'

విటమిన్ 'బి3' గొర్రె, మేక లివర్, కిడ్నీలు, గుండె నుంచి, చేపలు, మాంసం, ధాన్యాలు, డేట్స్, ఫ్రూట్స్, నట్స్, లేగ్యూమ్స్, అవాకడోస్ నుంచి పొందవచ్చు. 'బి3' లోపంతో చర్మంపై మచ్చలు, డయేరియా, జీర్ణ సంబంధిత సమస్యలు, వాంతులు, డిప్రెషర్, కన్‌ఫ్యూజన్, ఇన్‌సోమినియా, లాస్‌ఆఫ్ ఆపెటైట్ వంటివి వస్తాయి.

విటమిన్ 'బి5'

విటమిన్ 'బి5'తో జీవనాడి వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. దీన్ని అన్ని రకాల ధాన్యాలు, నట్స్, లేగ్యూమ్స్, పుట్ట గొడుగులు, కాలేయం, గుండె, చేపలు, కోడి గుడ్డు తెల్లసొన, పాల నుంచి పొంద వచ్చు. 'బి5' తక్కువైతే పాటిగ్యూ, ఇన్‌సోమి నియా, డిప్రెషన్, తలనొప్పి, వాంతుల ప్రభావం ఉంటుంది.

విటమిన్ 'డి'



విటమిన్ 'డి'తో ఎముకలు, దంతాలు గట్టిపడతాయి. కండరాల శక్తి పెరుగుతుంది. రోగ నిరోధక శక్తి పెంపునకు ఉపయోగపడుతుంది. శరీరంపై పడే సూర్య రశ్మీ, నూనె, సముద్రం చేపలు, కోడి గుడ్డు, మాసం, పాలు, పుట్ట గొడుగులు, నెయ్యి నుంచి లభిస్తుంది. విటమిన్ లోపంతో కండరాల పటుత్వం తగ్గడం, ఎముకలు, రిక్కెట్, ఓస్ట్రో పారోసిస్ సమస్యలు వస్తాయి.

విటమిన్ 'ఇ'

విటమిన్ 'ఇ' ఆరోగ్య కరమైన కణజాలం, ఆర్గాన్స్, సెల్స్, రక్త ప్రసరణ, సంతానోత్పత్తి పెరుగుదలకు ఉపయోగపడుతుంది. పాలు నెయ్యి, కోడి గుడ్డు, నట్స్, గ్రేన్స్, విట్ జర్మ్ కూరగాయలు, ఆయిల్ నుంచి లభిస్తుంది. ఇది లోపిస్తే కండరాలు బలహీనత, దృష్టి లోపం, రక్త నాళాల సమస్యలు లోఇమ్యూనిటీ సమస్యలు వస్తాయి.

విటమిన్ 'కె'

విటమిన్ 'కె' చీజ్, మాంసం, లివర్, ఆకుకూరలు, ఓట్స్, పొటాటో, టమాట, కూరగాయలు సోయాబీన్స్ నుంచి లభిస్తుంది. రక్త ప్రసరణ మెరుగవుతుంది. ఎముకలు, గుండె, మెరుగ్గా పని చేస్తాయి. తక్కువైతే రక్త స్రావం, చిగుళ్లు, ముక్కు నుంచి కూడా రక్త స్రావం అవుతుంది.

విటమిన్ 'బి6'

విటమిన్ 'బి6' ద్వారా జీనవాడి వ్యవస్థ, మెదడు పనితీరు మెరుగు పడుతుంది. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. తక్కువైతే కిడ్నీల్లో రాళ్లు, డిప్రెషన్, పాటిగ్యూ, నరాల సమస్యలు, చర్మంపై మచ్చలు, ఎక్కువైతే చాతిలో మంట కూడా వస్తుంది. వాల్‌నట్స్, పినట్స్, కార్న్, బ్రెడ్, చికెన్, లివర్, సాల్మాన్, టూనా చేప నుంచి లభిస్తుంది.

విటమిన్ 'బి7'

విటమిన్ 'బి7'తో బలమైన జుట్టు, గోర్ల దృఢత్వం కోసం పని చేస్తుంది. కూరగాయలు, ధాన్యాలు, వాల్‌నట్స్, పినట్స్, సోయాబీన్స్, మాంసం, కోడిగుడ్డు తెలసొన నుంచి పొందవచ్చు. 'బి7'తో తక్కువైతే జుట్టు రాలడం, తెల్లబడడం, డిప్రెషన్, చర్మం పొడిబారడం, వాంతులు, కండరాల బలహీనతలు వస్తాయి.

విటమిన్ 'బి9'

విటమిన్ 'బి9' ఆకుపచ్చని కూరగాయలు, బీట్స్, విట్ జర్మ్, పినట్స్, ఆరెంజస్, బీన్స్, లీవర్, పాలు, గుడ్డు తెల్లసొన నుంచి 'బి9' పొందవచ్చు. ఎర్ర, తెల్ల రక్త కణాలు వృద్ధి చెందుతాయి. నరాల పనితీరు మెరుగు పడుతుంది. 'బి9' తక్కువైతే అలసట, నరాలు, జీర్ణ సంబంధిత సమస్యలు జన్యు పరమైన లోపాలు వస్తాయి.

విటమిన్ 'బి12'

విటమిన్ 'బి12'తో ఎర్ర రక్త కణాల పెరుగుదల, జీవనాడి వ్యవస్థ పనితీరు మెరుగవుతుంది. రోగ నిరోధక శక్తి పెంపుదలకు ఉపయోగపడుతుంది. గొర్రె, మేక లివర్, కిడ్నీలు, గుండె, మాంసం, కోడిగుడ్డు, చేపలు, డెయిరీ ఉత్పత్తుల నుంచి పొందవచ్చు. 'బి12' లోపిస్తే అనిమియా, నరాలు చిట్లడం, పాటిగ్యూ, లాస్‌ఆఫ్ అపెటైట్, శ్వాస కోశ సమస్యలు, వేళ్లు వంకర్లు పోవడం, వెన్నుపూస, నరాల సంబంధిత సమస్యలు వస్తాయి. ఎక్కువైతే శరీరంపై దద్దులు వస్తాయి.

విటమిన్ 'సి'

విటమిన్ 'సి' పాలు, బత్తాయి, కమలాలు, నేరేడు పండ్లు, స్ట్రాబెర్రిస్, జామ, మామిడిపండ్లు, పొటాటో, క్యాబేజీ, టమాటల్లో లభిస్తుంది. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. ఖనజాల వ్యవస్థ అభివృద్ధి చెందుతుంది. ఎముకలు దృఢత్వంగా తయారావుతాయి. విటమిన్ తక్కువైతే జుట్టు రాలిపోవడం, జర్మ పొడిబారడంతోపాటు రక్తస్రావం అవతుంది. ఎక్కువైతే కిడ్నీలో రాళ్లు ఏర్పడుతాయి.

నేతన్నలు మార్కెట్‌తో పోటీపడాలి

- ఆర్థికంగా ఎదగాలి
- యారన్ బ్యాంక్ 30 ఏళ్ల కల
- 20న వేములవాడలో సీఎం సభ
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



పాల్గొన్న యజమానులు, ఆసాములు

సిరిసిల్ల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ మార్కెట్‌తో పోటీ పడాలని, పరిశ్రమ, నేతన్నలు మరింత వృద్ధిలోకి రావాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. శనివారం సిరిసిల్ల కలెక్టరేట్‌లో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమస్థితి గతులపై చేనేత జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి శైలజరామయ్యార్‌తో కలిసి పరిశ్రమ యజమానులు, ఆసాములతో సమీక్ష నిర్వహించారు. పారిశ్రామికులు, ఆసాముల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు ఆర్వీఎంకు సంబంధించి 66 లక్షల మీటర్ల ఆర్డర్లు ఇవ్వను న్నట్లు తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖలకు కావాల్సిన బట్ట ఉత్పత్తి ఆర్డర్లు ఇప్పిం చేందుకు కృషి చేస్తామన్నారు. మహిళా సంఘాలకు ఏడాదికి రెండు చీరలు ఇవ్వనున్నామని, వాటికి సంబంధించిన డిజైన్లు పూర్తయ్యాయని, త్వర లోనే అవసరమైన ఆర్డర్లు ఇస్తామని ప్రకటిం చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సమక్షంలో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి, యారన్ బ్యాంక్ అభివృద్ధికి రూ.30 కోట్లు మంజూరు చేశారన్నారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు 30 ఏళ్ల కలగా ఉన్న యారన్ బ్యాంక్ ఏర్పాటు నెరవేరుతోందన్నారు. 80 శాతం క్రెడిట్‌పై యారన్ అందజేస్తామని, టెస్కో ఆధ్వర్యంలో క్లాత్‌ను సేకరిస్తామని అన్నారు. కాటన్ వస్త్ర పరిశ్రమకు సహకారం అందిస్తామని, సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. విద్యుత్ సబ్సిడీ అంశం, డిప్యూటీ సీఎం విద్యుత్ శాఖ మంత్రితో చర్చిస్తామని ప్రకటించారు. సిరిసిల్లలో నిలిచిన పద్మశాలీ భవనం పూర్తి చేసే విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. సిరిసిల్ల అభివృద్ధి ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగదన్నారు. సిరిసిల్ల పరిశ్రమపై ఆధారపడిన కార్మికులు మనోధైర్యంతో ముందుకు సాగాలని, పరిశ్రమను కాపాడేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 20న వేములవాడకు రానున్నారని ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు జరుగుతు న్నాయని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. వేములవాడలో మధ్యాహ్నం 12.30 గంటలకు సభ ఉంటుందని, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు.

ఆధునికత వైపు వెళ్లాలి



మాట్లాడుతున్న శైలజరామయ్యార్

మార్కెట్‌లో వస్తున్న ఆధునికత వైపు సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ వెళ్లాలని చేనేత జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి శైలజరామయ్యార్ అన్నారు. సమీక్షలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దాదాపు ఆరు నెలల వరకు ఉపాధి కల్పించేందుకు ప్రణాళికలు రూపొం దిస్తోందన్నారు. మిగతా రోజుల్లో ప్రైవేటు మార్కెట్ లో ఉపాధి పొందేలా అలోచన చేయాలన్నారు. త్వరలో హోల్‌సేల్ వ్యాపారులతో సమావేశం ఏర్పా టు చేస్తామన్నారు. వారికి అవసరమైన బట్ట ఉత్ప త్తిపై చర్చిస్తామన్నారు. యారన్ బ్యాంక్‌ను సద్వి ని యోగం చేసుకోవాలని, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని స్వయం సమృద్ధి సాధించాలని అన్నారు. వస్త్ర పరిశ్రమకు చెందిన రూ. 200 కోట్ల వరకు బకాయిల విడుదల చేశామని, యారన్ సబ్సిడీ కూ డా విడుదల చేస్తామని అన్నారు. మిగతా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సమావేశంలో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, టెస్కో జీఎం అశో క్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ, సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్మన్ స్వరూపరెడ్డి, జౌళి శాఖ ఏడీ సాగర్, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా మాజీ సర్పంచ్‌లు

సుభాష్‌నగర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తమకు రావాల్సిన పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని ఉమ్మడి జిల్లా మాజీ సర్పంచుల జేఏసీ నాయకులు కోరారు. శనివారం కరీంన గర్‌లోని ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కరోనా సమయంలో శవాలను మోస్తూ, గ్రామాల్లో అన్ని రకాల అభివృద్ధి పనులు చేసి గ్రామాభివృద్ధికి తోడ్ప డ్డామన్నారు. గ్రంథాయలయాలు, క్రీడా ప్రాంగణాలు, గ్రామ పంచాయతి భవనాలు, డంపింగ్ యార్డు, మిషన్ భగీరత, సీసీ రోడ్డు, సీసీ డ్రైనేజీ, బతుకమ్మ తెప్ప, కమ్యూనిటీ భవనాలు, హైమాస్ట్ లైట్లు, శ్మానస వాటికలు, రైతు వేదికలు, మన ఊరు మన బడి పనులు చేపట్టామన్నారు. ఎండీ రికార్డులు కూడా రెడీ చేసుకొని సకాలంలో ఇవ్వకపోవడం వల్ల అనేక మంది ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. ఎంపీడీవో నుంచి ముఖ్యమంతి వరకు అం దరికీ వినతిపత్రాలు ఇచ్చామని తెలిపారు. జిల్లాకు రూ.250 కోట్లు రావాల్సి ఉందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా తమకు న్యాయం చేసేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో పంజాల జగన్‌మోహన్‌గౌడ్, కరుణాకర్, అంజయ్య రమేశ్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

శంకరపట్నం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో తాడికల్ శివారులో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం శనివారం రాత్రి పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఎస్సై కొత్తపల్లి రవి తెలిపిన వివరాల మేరకు.. తాడికల్ శివారులో వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమనాస్పదంగా కనిపించిన మూడు ఆటోలను ఆపి తనిఖీ చేశామన్నారు. ఈ ఆటోల్లో 10 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నాయన్నారు. మూడు ఆటోలను సీజ్ చేసి వాటిలో ఉన్న శ్రీనివాస్ ,రవి, నరసింహను పోలీస్ స్టేషన్ కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఈ ప్రిన్సిపాల్ మాకొద్దు

- రోడ్డుపై విద్యార్థినుల నిరసన



ధర్నా చేస్తున్న లక్ష్మీపూర్ ఎంజేపీ విద్యార్థినులు

జగిత్యాలరూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ మహాత్మాజ్యోతి బాపూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ మమత తమకు వద్దూ లక్ష్మీపూర్ గురుకుల పాఠశాల విద్యార్థినులు శనివారం రోడ్డెక్కి నిరసనకు దిగారు. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో బయటకు వచ్చి రోడ్డు పై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ప్రిన్సిపల్ మమతను తొలగించాలని పట్టుబట్టారు. ఈసందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ పాఠశాలలో ఏ ఒక్క సమస్యను ప్రిన్సిపాల్ పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు. పాఠశాలకు వచ్చిన తమ తల్లిదండ్రులతో సరిగా మాట్లాడనివ్వరని, వారితో సైతం అసభ్యంగా ప్రవర్తించేవారని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్‌ను తొలగించేవరకు ఆందోళన విరమించేది లేదని విద్యార్థులు పట్టుబట్టారు. పాఠశాలలో ఉన్న టీచర్లు వచ్చిపిల్లలకు సర్దిజెప్పడంతో తిరిగి హాస్టల్‌కు వెళ్లారు. మమతను సస్పెండ్ చేస్తున్నట్లు ఆర్‌సీవో ప్రకటించడంతో విద్యార్థినిలు శాంతించారు.

- లక్ష్మీపూర్ గురుకుల ప్రిన్సిపాల్ సస్పెన్షన్..

జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ జ్యోతిబాపూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ మమత ను సస్పెండ్ చేస్తూ గురుకుల స్టేట్ ప్రిన్సిపల్ సెక్రటరీ సైదులు శనివారం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఆర్‌సీవో అంజలి తెలిపారు. రెండు రోజుల క్రితం లీవ్‌పెట్టిన ప్రిన్సిపల్ లీవ్‌లో ఉండి పాఠశాలకు హాజరైన సందర్భంలో ఆమె వ్యక్తిగత విషయానికి సంబంధించి గొడవ జరిగినట్లు ఆర్‌సీవో తెలిపారు. పాఠశాలలో జరిగిన ఈ గొడవకు సంబంధించి అందిన ఫిర్యాదు మేరకు ఆర్‌సీవో అంజలి, జిల్లా కోఆర్డినేటర్ సుస్మిత సంయుక్తంగా విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదించినట్లు తెలిపారు. ఈ మేరకు విచారణ జరిపిన అధికారులు ఆమెను సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తుర్వులు జారీ చేశారు.

- ప్రిన్సిపాల్‌పై విచారణ చేపట్టాలని ప్రభుత్వవిప్ ఆదేశం

జగిత్యాలరూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి):జగిత్యాల రూరల్ మండలం లోని లక్ష్మీపూర్ మహాత్మాజ్యోతిబాపూలే విద్యార్థినులు పాఠశాల ప్రిన్సిపాల్‌ను తొలగించాల ని డిమాండ్ చేస్తూ శనివారం రోడ్డెక్కి ధర్నా చేసిన విషయం తెలుసుకున్న ప్రభుత్వవిప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ జిల్లా అధికారులతో ఫోన్ లో మాట్లాడారు. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారు

- పదేళ్ల గత ప్రభుత్వ హయాంలో రూ.7.5 లక్షల కోట్ల అప్పు - రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకుంటున్న మంత్రి పొన్నం ప్రభాకర్

వేములవాడ కల్చరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల కుప్పగా మార్చారని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కార్తీక మాసం సందర్భంగా శనివారం ఉదయం వేములవాడ రాజన్న ఆలయంలో ప్రత్యేక పూజలకు హాజరయ్యారు. అనంతరం రాజన్న ఆలయ గెస్ట్‌హౌస్‌లో విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వ పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తోందని, ఈ సంవత్సర కాలంలో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. ఏడాదిలో కాంగ్రెస్ ప్రభు త్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేం దుకు సీఎం రేవంత్‌రెడ్డి ముందుకొస్తున్నారన్నారు. ఇందులో భాగంగానే 19వ తేదీన వరంగల్‌లో మహిళా సదస్సు, 20వ తేదీన వేములవాడ రాజన్న ఆలయంలో, 25వ తేదీన కరీంనగర్‌లో యువజన సదస్సులు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. లగచర్లలో ఫార్మా ఇండస్ట్రీయల్ కారిడార్ భూసేకరణ కోసం జరిగిన ప్రజా అభిప్రాయ సేకరణలో అధికారులపై దాడికి సంబంధించిన విషయంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యలపై స్పందిస్తూ అసలు కిషన్‌రెడ్డి మంత్రి పదవికి అర్హుడా.. కాదో? తెలియడం లేదన్నారు. అధికారులపై దాడి సరికాదంటూనే గ్రామ స్థులను అరెస్టు చేయొచ్చా? అని ప్రశ్నిస్తారన్నారు. ఏం చేయమంటారో ప్రభుత్వానికి సలహా ఇవ్వవచ్చు కదా అని హితవు పలికారు. కేంద్ర మంత్రి పదవిలో ఉండి అలా మాట్లాడటం సరికాదని అభిప్రాయపడ్డారు. కుల గణన సర్వేపై ప్రజలు ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. ఇప్పటి వరకు 40 శాతం సర్వే పూర్తయ్యిందన్నారు.

కేటీఆర్‌ను అరెస్టు ఎప్పుడు చేస్తారు? అని విలేకర్లు అడిగిన ప్రశ్నకు 'నేను ఎంక్వాయిరీ అధికారిని కాదు. చట్టం పని చట్టం చేసుకుంటూ పోతుంది. ఇతర నాయకుల మాదిరిగా నేను అరెస్టు చేపిస్తానని చెప్పను. నేను అరెస్టు చేయమంటే చేస్తారా' అని ఎదురు ప్రశ్నించారు. రాజన్న ఆల పాలకవర్గం ఏర్పాటుపై అథారిటీ ఉన్నప్పుడు పాలకవర్గం ఏర్పాటు చేయరాదన్నారు. చట్టపరమైన అంశాలను పరిశీలించి ముందుకెళ్తామన్నారు. అంతకు ముందు రాజన్న ఆలయ ఈవో వినోద్ రెడ్డి మంత్రికి ప్రసాదం అందజేశారు. మంత్రి వెంట ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ప్రజావసరాలను గుర్తించడానికే సర్వే

మల్యాల, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రజావసరాలను గుర్తించడానికే ప్రభుత్వం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేపట్టిందని ప్రజలంతా సహకరించాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాక ర్‌గౌడ్ కోరారు. శనివారం కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్న అనంతరం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి మాట్లాడారు. సర్వేలో సేకరించే సమాచారంతో భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు ఉండవని స్పష్టం చేశారు. మంత్రి వెంట మల్యాల, కొడిమ్యాల మండలాల నాయకులు ఉన్నారు.

● అంజన్న సన్నిదిలో పూజలు

కొండగట్టు ఆంజనేయస్వామిని మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన మంత్రికి అధికారులు, అర్చకులు పూర్ణకుంబస్వాగతం పలి కారు. ఆలయంలో పూజలు నిర్వహించారు. ఏఈవో అంజయ్య శాలువాతో సత్కరించగా అర్చకులు స్వామి వాఇ తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఆలయ పర్యవేక్షకులు హరిహరనాథ్, చంద్రశేఖర్ ఉన్నారు. కొండగట్టు గిరిప్రదిక్షణ మార్గం అభివృద్ధికి మంత్రి పొన్నం ప్రభాకర్ తన సొం తంగా రూ.2లక్షలు అందిం చనున్నట్లు తెలిపారు. గిరిప్రదిక్షణ గురించి ము త్యంపేట మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్ మంత్రి, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో నిధులు అందిస్తానని అన్నారు. గిరిప్రదిక్షణ చేసే భక్తులకు విశ్రాంతి, నీటి సౌకర్యానికి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హామీ ఇచ్చారు.

24న ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్/రామడుగు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 24న ఉమ్మడి జిల్లా జిల్లా స్థాయి జూనియర్ అండర్-14 బాలుర, బాలికల ఎంపిక పోటీలను సిరిసిల్లలోని రైసింగ్‌సన్ స్పోర్ట్స్ అకాడమీ గ్రౌండ్‌లో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేని లక్ష్మణ్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. పాల్గొనే క్రీడాకారులు శనివారం ఉదయం 10 గంటలకు కోచ్‌లు ప్రేమ్ కు మార్, కృష్ణహరి, జిల్లా సంయుక్త కార్యదర్శి ఎన్ ప్రభాకర్‌లకు రిపోర్టు చేయాలని పేర్కొ న్నారు. వివరాలకు 9441925807, 8978995730, 9603388143 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

వెల్గటూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండలంలోని ముత్తునూర్ గ్రామంలో శనివారం రాత్రి జరిగినరోడ్డు ప్రమాదంలో అంబారిపేటకు చెందిన ఆరెల్లి విఘ్నేష్ (20) అనే యువకుడు మృతి చెందాడు. విఘ్నేష్ మరో యువకుడితో కలిసి బైక్(టీఎస్ 21 జే6811)పై అంబారిపేట నుంచి ముత్తునూర్ వచ్చారు. తిరుగు ప్రయాణంలో ముత్తునూర్ ముక్తేశ్వర లిఫ్ట్ క్రాసింగ్ వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి లిఫ్ట్ బావికి ఢీకొట్టింది. ఈ సంఘటనలో వాహనం నడుపుతున్న విఘ్నేష్ అక్కడికక్కడే మృతి చెందగా మరో యువకుడికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

న్యూస్ బాక్స్

కథల పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

గంభీరావుపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సారస్వత పరిషత్ హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి కథల పోటీలలో గంభీరావుపేట బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని సీహెచ్.ప్రణీతకు ప్రథమ స్థానంలో బహుమతి లభించింది. శనివారం హైదరాబాద్‌లో మాజీ ఐఏఎస్ అధికారి, పూర్వ ప్రభుత్వ సలహాదారు కె.వి.రమణాచారి, పరిషత్ చైర్మన్ చెన్నయ్య పద్మభూషణ్ అవార్డు గ్రహీత కే వరప్రసాద్ రెడ్డి మెమొంటో, సర్టిఫికెట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు బుస లక్ష్మణ్, ఉపాధ్యాయులు విద్యార్థినిని అభినందించారు.

క్రీడల్లో సత్తాచాటిన విద్యార్థులు

గంభీరావుపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మూడు జిల్లాల పరిధి జోనల్ మీట్‌లో గంభీరావుపేట మండలం నర్మాల గురుకుల పాఠశాల విద్యార్థినులు సత్తాచాటారు. ఈనెల 11వ తేదీ నుంచి 14 వరకు మెదక్ తెలంగాణ వెల్ఫేర్ స్కూల్ సొసైటీలో రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, మెదక్ మూడు జిల్లాల పరిధిలో 10 జోనల్ మీట్ నిర్వహించారు. ఈ ఆటల పోటీలలో నర్మల గురుకుల విద్యార్థులు ఖోఖో, కబడ్డీ, టెన్నికాయిట్, హై జంప్, షాట్ పుట్, రన్నింగ్, 400 రిలే ఫస్ట్ ప్లేస్‌లో, వాలీబాల్ బాల్ బ్యాడ్మింటన్, 400 అండ్ 600 మీటర్స్ రన్నింగ్‌లో సెకండ్ ప్లేస్‌లో విజ యం సాధించారు. ఈ విద్యార్థులను గురుకుల పాఠశాల, కాలేజీ ప్రధానో పాధ్యా యులు సృజన, ఫిజికల్ డైరెక్టర్ భారతి, పీఈటీ స్వర్ణలత అవార్డులు సాధించిన విద్యార్థులను అభినందించారు.

ఏర్పాట్లు.. కట్టుదిట్టం

(5వ పేజీ తరువాయి)

పరీక్ష ముగిసిన తరువాత ఓఎంఆర్ షీటును ఇన్విజిలేటర్‌కు అందించి నామినల్ రోల్‌పై వేలి ముద్రలు వేయాల్సి ఉంటుంది.

ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదు

జిల్లాలో జరిగే గ్రూప్-3 పరీక్ష నిర్వహణలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిబంధనలు కట్టుదిట్టంగా అమలు చేయడానికి యంత్రాంగం సిద్ధమైంది. పరీక్ష నిర్వహణలో ఉండే సిబ్బంది తప్పనిసరిగా గుర్తింపు కార్డు ధరించే విధంగా ఏర్పాట్లు చేశారు. పరీక్షకు వచ్చే అభ్యర్థులు చెప్పులు ధరించాల్సి ఉంటుంది. ఎలక్ట్రానిక్ పరికరాలు, ఆభరణాలను పరీక్ష కేంద్రంలోకి అనుమతించరు. అభ్యర్థులు తమవెంట హాల్‌టికెట్ పెన్ను మాత్రమే తీసుకురావాలి. పరీక్ష కేంద్రాల్లో మొబైల్ ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లు భద్రపర్చుకోవడానికి లాక్ రూం సౌకర్యం కల్పించరు. అభ్యర్థులు తమ హాల్ టికెట్‌లో ఉన్న ప్రతి సూచనను తప్పకుండా పాటించాలి. మహిళలు, పురుషులకు అభ్యర్థులను తనిఖీ చేయడానికి వేర్వేరుగా ఏర్పాట్లు చేశారు. అభ్యర్థులు రూం నంబరు, కేటాయించిన సీటు వద్దకు చేరుకొని ప్రశ్నాపత్రం కోడ్‌ను పరీక్షించుకోవాలి. స్కూల్ దగ్గర చుట్టుపక్కల పోలీసులు సూచించిన పార్కింగ్ ప్రదేశాల్లో వాహనాలు పార్క్ చేసుకోవాలి.

పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163 అమలు

జిల్లాలో గ్రూప్-3 పరీక్షల సందర్భంగా 25 కేంద్రాల వద్ద బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 (144 సెక్షన్)ను అమల్లో ఉంటుంది. పరీక్ష కేంద్రానికి 50 మీటర్ల వరకు ప్రజలు ఎవరూ గుమిగూడకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్‌లూ మూసివేయడం, చుట్టుపక్కల లౌడ్ స్పీకర్‌లపై నిషేధం విధించారు.

మండల కేంద్రాల నుంచి ప్రత్యేక బస్సులు

పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహిస్తున్న గ్రూప్- 3 పరీక్ష సమయానికి అభ్యర్థులు చేరుకునే విధంగా సిరిసిల్ల, వేములవాడ ఆర్టీసీ డిపోల నుంచి ప్రత్యేక బస్సులను నడపడానికి ఏర్పాట్లు చేశారు. ఉదయం 8.30 గంటలకు పరీక్ష కేంద్రానికి చేరుకునే వీలుగా సాయంత్రం 5.30 గంటల తరువాత తిరిగి వెళ్లే విధంగా మండల కేంద్రాల నుంచి రవాణా సౌకర్యం కల్పించారు.

ప్రజాభిప్రాయానికి అనుగుణంగా కాంగ్రెస్ పాలన



చీర్లవంచలో మాట్లాడుతున్న విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధుల ఆలోచన మేరకు ప్రజలు వెళ్లడం కాకుండా ప్రజా అభిప్రాయాల మేరకు కాంగ్రెస్ పాలన ముందుకు సాగుతోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ మండల చీర్లవంచ ఆర్అండ్ఆర్ కాలనీలో కాంగ్రెస్ కార్యకర్తలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ మిడ్‌మానేరు ముంపు గ్రామాల నిర్వాసితుల కోసం కొట్లాడిన వాడిలో తాను మొదటి వాడినని, నిర్వాసితుల సమస్యల పరిష్కారంపై పూర్తి విశ్వాసంతో ఉన్నానని అన్నారు. పీసీసీ అధ్యక్ష హోదాలో రేవంత్‌రెడ్డి పాదయాత్ర చేపట్టారని, ముంపు గ్రామాల్లో పర్యటించి నిద్ర చేశారని గుర్తు చేశారు. ముంపు గ్రామాల కోసం ఆనాడు ఉద్యమం చేసిన సమయంలో 3,700 దరఖాస్తులు వచ్చాయన్నారు. ముంపు గ్రామాల సమస్యల పరిష్కారంపై కలెక్టర్, ఆర్డీవోతో సమీక్షించామని, ఇప్పటి వరకు నాలుగు గ్రామాలకు సంబంధించిన సమస్యలు ఓ కొలిక్కి వచ్చాయని అన్నారు. మిగతా గ్రామాల్లోని సమస్యలను త్వరలోనే పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామన్నారు. ముంపు గ్రామాల సమస్యల పరిష్కారానికి సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన ఒక వేదికగా నిలుస్తుందన్నారు. చీర్లవంచలోని బేడబుడిగ జంగాల వారికి శ్మశాన వాటిక కోసం ఎకరం స్థలాన్ని కేటాయించినట్లు చెప్పారు. ఈ నెల 20వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి వేములవాడలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి హాజరుకానున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య, జిల్లా నాయకులు చింతపల్లి శ్రీనివాస్, ఎర్రం రాజు, బోనాల రమేష్, రాములు, దేవరాజు, కత్తి కనుకయ్య, కదిరే రాజు, పండుగ ప్రదీప్, ఇటిక్యాల రాజు తదితరులు ఉన్నారు.

గ్రంథాలయ చైర్మన్‌ను కలిసిన న్యాయవాదులు



చైర్మన్‌ను కలిసిన న్యాయవాదులు, నాయకులు

సిరిసిల్ల రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా గ్రంథాలయ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన నాగుల సత్యనారాయణ గౌడ్‌ను శనివారం న్యాయవాదులు, నాయకులతో పాటు టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ కలిశారు. సిరిసిల్ల జిల్లా గ్రంథాయలంలో చైర్మన్ సత్యనారాయణగౌడ్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లా టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్ ఇరుకుల్ల అశ్విన్, ఉపాధ్యక్షుడు వెంకటరెడ్డి, కన్వీనర్లు బుర్ర వివేక్‌గౌడ్, తిప్పవరపు అనిల్, బాబు, శశి కుమార్, స్పోక్స్ పర్సన్ బొద్దుల రాజేష్, భగవాన్, జాయింట్ కన్వీనర్లు మారుతీగౌడ్, అన్సార్‌అలీ, సభ్యులు యమున, సుహాసిని, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, నాయకులు సంగీతం శ్రీనివాస్, గడ్డం నర్సయ్య తదితరులు ఉన్నారు.

అయ్యప్ప స్వాముల పూజలు



హోమం నిర్వహిస్తున్న స్వాములు

ఎల్లారెడ్డిపేట, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్, రాజన్నపేట గ్రామాల్లోని శ్రీహరిహరపుత్ర అయ్యప్ప స్వామి ఆలయాల్లో స్వామివారి మండల పూజను శనివారం ఘనంగా నిర్వహించారు. డిసెంబరు 26న మండల మహా పడిపూజ నిర్వహించనున్నామని శ్రీను గురుస్వామి పేర్కొన్నారు. స్థానికులు మరిగంటి ప్రియాంక- రంగాచార్యులు సహకారంతో ఈ నెల 16 నుంచి సంక్రాంతి వరకు స్వాములకు అన్నదానం చేయనున్నట్లు చెప్పారు.

ఆకట్టుకున్న విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శన

ఇల్లంతకుంట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇల్లంతకుంట మండల కేంద్రంలోని కేరళ మోడల్ హై స్కూల్‌లో శనివారం ప్రపంచ సైన్స్ డే సందర్భంగా విద్యా వైజ్ఞానిక ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో పాఠశాలకు చెందిన విద్యార్థులు నైపుణ్యాన్ని ప్రదర్శించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు మహేష్ చంద్ర, ఆదర్శ పాఠశాల రహీంఖాన్‌పేట ఉపాధ్యాయులు గుడెల్లి అంజన్న న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వమే పరిశోధనలకు పునాది అని రోజువారి జీవితం ప్రతి ఒక్కరికి సైన్స్‌తో ముడిపడి ఉందని అన్నారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణ కుమార్ మాట్లాడుతూ సమాజంలో నెలకొన్న మూఢనమ్మకాలను తొలిగించి మానవ సంక్షేమానికి విజ్ఞానశాస్త్రం ద్వారా పరిష్కారం లభిస్తుందన్నారు. ఉపాధ్యాయులు బిన్సీ, నరేష్ రెడ్డి, బాలకృష్ణ, షనీ, బిజూ, మహేందర్, ఎబిన్, రాజేందర్, ఆర్గిల్ పాల్గొన్నారు.

ఏబీవీపీ నాయకుల ముందస్తు అరెస్టు

ఇల్లంతకుంట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇల్లంతకుంట మండలంలో ఏబీవీపీ నాయకులను పోలీసులు శనివారం ముందస్తు అరెస్ట్ చేశారు. నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్ ఐటీలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని స్వాతి కుటుంబానికి న్యాయం చేయాలని, ఏబీవీపీ నాయకులపై దాడి చేసిన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బాసర ట్రిపుల్ ఐటీ ముట్టడికి వెళ్తున్నారనే సమాచారంతో శనివారం తెల్లవారుజామున అదుపులోకి తీసుకున్నారు. ఏబీవీపీ రాష్ట నాయకుడు అక్కెం నాగరాజుతోపాటు మండల కన్వీనర్ కూనబోయిన ప్రవీణ్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



వినతి పత్రాన్ని అందజేస్తున్న నాయకులు

సిరిసిల్ల రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల వస్త్ర పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, వెంటనే ఉపాధి కల్పించాలని సీఐటీయూ తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్, జిల్లా అధ్యక్షుడు కోడం రమణ కోరారు. కలెక్టరేట్‌లో శనివారం చేనేత జౌళి శాఖ కార్యదర్శి శైలాజారామయ్యార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిరిసిల్లలో నేతన్నల ఆత్మహత్యలను నివారించాలని, కార్మికులందరికీ నిరంతరం ఉపాధితోపాటు మెరుగైన వేతనాలు అందించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని అన్నారు. కార్మికులకు శాశ్వత ఉపాధి కల్పనలో భాగంగా చేపట్టిన వర్కర్ టు ఓనర్ పథకాన్ని వెంటనే అమలు చేయాలన్నారు. 2023 సంవత్సరంలో బతుకమ్మ చీరలను తయారు చేసిన మరమగ్గాల కార్మికులకు రావాల్సిన 10 శాతం యారన్ సబ్సిడీ డబ్బులను వెంటనే కార్మికుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. అదే విధంగా 2022 సంవత్సరంలో పెండింగ్‌లో ఉన్న 80 మంది కార్మికులకు రావాల్సిన డబ్బులను అందించాలన్నారు. త్రిఫ్ట్ పథకాన్ని పునప్రారంభించడంతోపాటు కార్మికుల పొదుపు డబ్బులను అందించాలన్నారు. వస్త్రపరిశ్రమలతోపాటు అనుబంధ రంగాల కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని, ప్రత్యేక నిధులను కేటాయించాలని కోరారు. కార్మికుల నైపుణ్యం పెంచే విధంగా శిక్షణ కేంద్రాన్ని సిరిసిల్లలో ఏర్పాటు చేయాలన్నారు. ప్రత్యేకంగా వస్త్ర పరిశ్రమలతోపాటు అనుబంధ రంగాల కార్మిక ప్రతినిధులు, కార్మికులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి కార్మికుల సమస్యలను పరిష్కారించాలన్నారు.

ఎన్నికల హామీని నెరవేర్చాలి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు తిరుపతి

సిరిసిల్ల టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల సమయంలో ఎరుకలకు అండగా ఉంటామని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నెరవేర్చాలని, ఎరుకల ఫెడరేషన్ ఏర్పాటు చేసి రూ.500 కోట్లు నిధులను కేటాయించాలని తెలంగాణ ఎరుకల ప్రజా సమితి రాష్ట్ర అధ్యక్షుడు కెమసారం తిరుపతి డిమాండ్ చేశారు. శనివారం సిరిసిల్ల పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో సమితి జిల్లా స్థాయి సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా ఎరుకల కులస్థుల కోసం నిరుద్యోగ యువతీయువకులకు బ్యాంకులతో సంబంధం లేకుండా స్వయం ఉపాధి పథకాలను అందజేయాలన్నారు. తెల్ల పందుల పెంపకంపై ప్రభుత్వం శిక్షణ ఇప్పించాలని, రుణాలతో పాటు భూములు ఇవ్వాలని అన్నారు. ప్రభుత్వ శాఖలలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్‌లోనైనా ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. అంతకుముందు జిల్లా అధ్యక్షుడిగా కోనేటి పోచయ్య, ఉపాధ్యక్షులుగా బిజిలి దేవయ్య, కోనేటి ఉప్పలయ్య ప్రధాన కార్యదర్శిగా కమ్మసారం దుర్గయ్య, సహాయ కార్యదర్శిగా పల్లకొండ అంజనేయులు, కోనేటి తిరుపతి, కుర్ర శ్రీకాంత్, ప్రచారం కార్యదర్శులుగా నిమ్మశెట్టి ఎల్లయ్య, కోనేటి రవి, కోశాధికారిగా పల్లకొండ ఎల్లయ్య ఎన్నుకున్నారు. సమావేశంలో నాయకులు పోచయ్య, దేవయ్య, శ్రీకాంత్, ఎల్లయ్య, రవి, శ్రీనివాస్, సాగర్, సాయులు, జగన్నాథం పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు చల్మెడ పరామర్శ

చందుర్తి, నవంబరు 16: (ఆంధ్రజ్యోతి) చందుర్తి మండలం జోగాపూర్ గ్రామంలో గరిడె మహేష్ అనే బీఆర్ఎస్ కార్యకర్త ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహారావు శనివారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తపరిచారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య, సింగిల్ విండో చైర్మన్ జలగం కిషన్ రావు, నాయకులు ఉన్నారు.

రుద్రంగి: రుద్రంగి మండల కేంద్రంలో ఇటీవల వివిధ కారణాలతో మరణించిన బాధిత కుటుంబాలను వేములవాడ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు శనివారం పరామర్శించారు. ఆనారోగ్యంతో బీఆర్ఎస్ సీనియర్ కార్యకర్త ఒడ్యారపు మోహన్, రుద్రంగికి చెందిన సనుగుల గోవర్ధన్ మృతి చెందారు.

గుండెపోటుతో డ్రైవర్ మృతి

వేములవాడ టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): భక్తులను వాహనంలో రాజన్న దర్శనానికి తీసుకొచ్చిన డ్రైవర్ గుండెపోటుతో మృతి చెందిన సంఘటన వేములవాడలో శనివారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. మహబూబాబాద్ జిల్లా కేసముద్రంకు చెందిన సూరయ్య(55) అనే డ్రైవర్ అదే గ్రామానికి చెందిన భక్తులను వేములవాడ రాజన్న దర్శనానికి శుక్రవారం రాత్రి తీసుకొచ్చాడు. రాత్రి యాత్రికులతో కలిసి భోజనం చేసిన డ్రైవర్ ఆలయ పార్కింగ్ స్థలంలో వాహనంలో నిద్రిస్తానని చెప్పి వెళ్లాడు. శనివారం ఉదయం దర్శనం చేసుకున్న అనంతరం యాత్రికులు సూరయ్యకు ఎంత ఫోన్ చేసినా తీయలేదు. దీంతో వాహనం వద్దకు వెళ్లి చూడగా విగత జీవిగా కనిపించాడు,

హమాలీ కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలి



కేంద్రంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

ఇల్లంతకుంట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పనిచేసే హమాలీ కార్మికుల డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అజ్జవేణు, కడారి రాములు డిమాండ్ చేశారు. ఇల్లంతకుంట మండలంలోని పొత్తూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఏఐటీయూసీ నాయకులు పరిశీలించారు. సమస్యలపై హమాలీ కార్మికులతో మాట్లాడి వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పని చేస్తున్న కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఐడీ కార్డులను ఇవ్వడంతోపాటు హెల్త్‌కార్డు, ఇన్సూరెన్స్, ప్రమాద బీమా వంటి సౌకర్యాలను కల్పించాలన్నారు. గతంలో లారీ లోడ్ 600 బస్తాల వరకు హమాలీలు లోడ్ చేసేవారని, ఇప్పుడు 900 నుంచి 1000 బస్తాల వరకు లోడ్ చేయిస్తూ తిడు మాములు ఇవ్వడంలేదని అన్నారు. ఓవర్‌లోడ్ చేసే క్రమంలో హమాలీలు ప్రమాదం బారిన పడే అవకాశం ఉందని, రోడ్డుపై ప్రమాదం జరిగితే బాధ్యులు ఎవరని ప్రశ్నించారు. జిల్లా అధికారులు తక్షణమే స్పందించి ఓవర్‌లోడ్‌లారీలను నిరోధించాలన్నారు. ఇటీవల దయ్యాల బీరయ్య అనే కార్మికుడు తాడు కట్టె క్రమంలో తాడు తెగిపోయి ఇనుప రాడ్ తలపై పడి కుట్లుపడాయన్నారు. కలెక్టర్ స్పందించాలని, గాయపడిన బీరయ్యను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో హమాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు భూంపెల్లి భూంరెడ్డి కార్మికులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మానాల యువకుడి మృతి

-హైదారాబాద్‌లో ఘటన - గ్రామంలో విషాదం

రుద్రంగి, నవంబర్ 16 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలానికి చెందిన యువకుడు మృతి చెందగా అతడి స్వగ్రామం మానాలలో విషాదం నెలకొంది. స్థానికుల వివరాల ప్రకారం.. రుద్రంగి మండల మానాల గ్రామానికి చెందిన చంద వంశీ (20) హైదరాబాద్‌లో హోటల్ మేనేజ్‌మెంట్ పూర్తి చేశాడు. అక్కడే ఓ హోటల్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. శుక్రవారం అర్ధ రాత్రి గదికి వెళ్తుండగా సుల్తాన్ బజార్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎదురుగా వచ్చిన ద్విచక్రవాహనం ఢీకొంది. వంశీకి తీవ్ర గాయాలవడంతో మృతి చెందడాని గ్రామస్థులు తెలిపారు.

హార్వెస్టర్.. బస్సు ఢీ

- బస్సు డ్రైవర్‌కు స్వల్ప గాయాలు - తప్పిన ప్రమాదం

తంగళ్లపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామ శివారులోని జిల్లా సరిహద్దులో హార్వెస్టర్ బస్సు ఢీ కొనడంతో బస్సు డ్రైవర్ స్వల్పంగా గాయపడ్డాడు. హైదరాబాద్‌కు చెందిన ప్రైవేట్ బస్సు సుమారు 40 మంది ప్రయాణికులతో వేములవాడ వైపు వెళ్తోంది. ఎదురుగా హార్వెస్టర్ వస్తోంది. ఎదురెదురుగా ఢీకొనడంతో బస్సు, హార్వెస్టర్ ముందు భాగాలు ధ్వంసమయ్యాయి. బస్సు డ్రైవర్ స్వల్పంగా గాయపడ్డాడు. 40 మంది ప్రయాణికులు క్షేమంగా బయటపడ్డారు. సంఘటన స్థలాన్ని ఎస్సై రామ్మోహన్ పరిశీలించారు.

నల్ల మాస్కులతో రైల్వే భూ నిర్వాసితుల నిరసన



నిరసన తెలుపుతున్న భూ నిర్వాసితులు

వేములవాడ, నవంబర్ 16 (ఆంధ్రజ్యోతి) : రైల్వేలైన్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న నిర్వాసితులు శనివారం నల్లమాస్కులు ధరించి నిరసన వ్యక్తం చేశారు. స్థానిక మున్నూరు కాపు నిత్యాన్నదాన సత్రంలో మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య నేతృత్వంలో భూనిర్వాసితులు రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిపై ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కొండ దేవయ్య మాట్లాడుతూ రాజన్న ఆలయ అభివృద్ధి కోసం తాము భూములు ఇస్తామని ముందుకు వచ్చామని, గత ప్రభుత్వం మూడింతల పరిహారం ఇస్తానని చెప్పి డబ్బు ఇవ్వకుండా కాలయాపన చేసిందని ఆరోపించారు. ముఖ్యమంత్రి హోదాలో తొలిసారి వేములవాడకు వస్తున్న రేవంత్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేసి తమ బాధలు చెప్పుకుంటామని అన్నారు. రైల్వే లైన్ కోసం ఇప్పటికే శివారు భూములు సేకరించారని, తమ భూముల విషయంలోనే ఎలాంటి స్పష్టత ఇవ్వడం లేదని అన్నారు. తమ సమస్యపై స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను పలుమార్లు కలిసి విన్నవించినప్పటికీ ఎలాంటి పరిష్కారం లభించలేదని, తమ సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉందన్నారు.

పాదయాత్రను విజయవంతం చేయాలి

గంభీరావుపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) ఈ నెల 19న రాజన్న సిరిసిల్ల జిల్లాకు చేరే మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ పాదయాత్రను విజయ వంతం చేయాలని మాల మహానాడు జిల్లా బాధ్యులు మల్యాల రాజవీర్ పిలుపు నిచ్చారు. గంభీరావుపేట మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం విలేకరులతో మాట్లాడారు. భద్రాచలంలో ఇటీవల మొదలైన మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ పాద్ర యాత్ర సిరిసిల్ల జిల్లాకు 19న చేరనుందన్నారు. మాలమహానాడు కార్యకర్తలు, నాయకులు, విద్యార్థులు, మేదావులు తరలిరావాలన్నారు. డిసెంబరు 1న హైదరాబాద్‌లో మాలల సింహ గర్జన సభను విజయ వంతం చేయాలన్నారు. మాల మహానాడు నాయకులు ఎడబోయిన రాజు, ఎగదండి స్వామి, బండ రమేష్, ఆయా గ్రామాల మాల మహానాడు ఉన్నారు.

ఒకరి రిమాండ్

ఎల్లారెడ్డిపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్‌కు చెందిన యూ ట్యూబ్ ఛానల్ రిపోర్టర్ బెస్త నరేశ్‌ను రిమాండ్‌కు తరలించామని ఎస్సై రమాకాంత్ శనివారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. గ్రామంలోని నీరటి భవాని అంగన్‌వాడీ టీచరుగా విధులు నిర్వహిస్తోంది. అదే గ్రామానికి చెందిన యూట్యూబ్ ఛానల్ విలేకరి బెస్త నరేశ్ ఈ నెల 5న అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లాడు. కోడిగుడ్లు, బియ్యం, నగదు ఇవ్వాలని బెదిరింపులకు దిగాడు. దీంతో బాధితురాలు భవాని ఈ నెల 6న పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. నరేశ్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు, న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు ఎస్సై వివరించారు.

రెండు గ్రామాల్లో పొలం బాట

బీర్‌పూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంగేళ, నర్సింహులపల్లి, కందెనకుంట గ్రామాల్లో శనివారం విద్యుత్ శాఖ, వ్యవసాయ శాఖ అధికారులు పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్‌శాఖ అధికారులు రైతులకు విద్యుత్ వినియోగం గురించి, కెపాసిటర్ వినియోగం వల్ల వచ్చే లాభాలను వివరించారు. ప్రమాదాల నివారణ గురించి రైతులకు అవగాహన కల్పించారు. విద్యుత్ వినియోగంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

రేవంత్‌రెడ్డి పాలనపై బురదజల్లే ప్రయత్నం



సమావేశంలో మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

సిరిసిల్ల టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనపై కేటీఆర్ బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాటాడారు. అధికారం కోల్పోయాక కేటీఆర్ మతిభ్రమించి అవాకులు చెవాకులు పేలుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ఏదైనా సంఘటన జరిగినప్పుడు ప్రతిపక్ష నాయకుడిగా పరామర్శించడాన్ని తాము తప్పుబట్టబోమన్నారు. కేటీఆర్ నియోజకవర్గంలో ఎన్నో దాడులు జరిగాయని, ప్రజాస్వామిక విలువలు, పౌర హక్కులను కాలరాశారని మండిపడ్డారు. నాటి ప్రభుత్వం చేసిన పైసాచిక దాడులను కేటీఆర్ మరిచిపోయారని ఆరోపించారు. సిరిసిల్ల నేరెళ్ల ఘటన దేశాన్ని కుదిపేస్తే కేటీఆర్ కుటుంబాన్ని మాత్రం కుదిపేయలేదన్నారు.అప్పుడు కేటీఆర్‌కు పౌర హక్కులు, ప్రాథమిక హక్కులు, ప్రజాస్వామ్యం జ్ఞాపకం రాలేదన్నారు. నేరెళ్ల బాధితులే ఆ సంఘటనకు నిలువెత్తు సాక్ష్యం అన్నారు. నేరెళ్ల సంఘటనపై కేటీఆర్ కనీసం విచారణకు కూడా ఆదేశించలేదని ఆరోపించారు. ఆ రోజు కేటీఆర్‌కు స్పందించే మనస్సు లేకుండా పోయిందన్నారు. కేటీఆర్ నియంతృత్వ అప్రజాస్వామ్య పరిపాలనకు నేరెళ్ల బాధితులు నిలువెత్తు సాక్షం అన్నారు. ఖమ్మం మిర్చి రైతులను, మహిళలను జైళ్లలో పెట్టిన సంఘటనను కేటీఆర్ మర్చిపోయారన్నారు. మంచిర్యాలలో ఇళ్లు కావాలని గిరిజన మహిళలు ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకుంటే పోలీసు యంత్రాంగం చేసింది మర్చిపోయావా? అని ప్రశ్నించారు. వీర్నపల్లి మండలంలో గిరిజనలు ప్రభుత్వ భూముల్లో వ్యవసాయం చేసుకుంటుంటే 144 సెక్షన్ పెట్టి భూముల్లోకి పోనివ్వకుండా కొట్టించింది వాస్తవం కాదా అన్నారు. ఈ రోజు లగిచర్ల దాడిలో సూత్రధారి కేటీఆర్ అని తేట తెల్లమవుతుందన్నారు. కేటీఆర్, పట్నం నరేందర్‌రెడ్డి, సురేష్ మధ్య సెల్ ఫోన్ సంభాషణలు తేటతెల్లం కావడంతో నిజాలన్నీ బయటపడతాయన్నారు. నేరెళ్ల బాధితులు మాట్లాడుతూ నేరెళ్ల సంఘటన జరిగి ఎనిమిది సంవత్సరాలు అవుతోందని, గత బీఆర్ఎస్ ప్రభుత్వం, నాయకులు ఏ రోజూ పరామర్శించ లేదని అన్నారు. తమ కుటుంబానికి అండగా నిలబడలేదన్నారు. ప్రతిపక్ష పార్టీలు, కులసంఘాలు అండగా నిలిచాయన్నారు. ఆరోజు తాము దళిత బిడ్డలమని ప్రభుత్వానికి, కేటీఆర్‌కు ఎందుకు గుర్తుకు రాలేదని ప్రశ్నించారు. లగిచర్ల రైతులపై చూపిన ప్రేమ ఆరోజు తమపై ఎందుకు చూపలేదన్నారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ, సిరిసిల్ల మార్కెట్ కమిటీ కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బాలరాజు, మహిళా జిల్లా అధ్యక్షురాలు వనిత, కౌన్సిలర్లు కుడికాల రవి కుమార్, రెడ్మానాయక్, పీసీసీ మాజీ కార్యదర్శి గడ్డం నర్సయ్య, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ నేరెళ్ల శ్రీకాంత్‌గౌడ్, నేరెళ్ల బాధితులు హరీష్, బాలయ్య, కాంగ్రెస్ నాయకులు గౌతమ్, భీమారం శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొండగట్టులో భక్తుల రద్దీ



ఆలయ ఆవరణలో భక్తులు

మల్యాల, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధా నం శనివారం భక్తులతో రద్దీగా మారింది. వేలాదిగా భక్తులు కొండపైకి తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయంలో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం బేతాళుడి వద్ద కూడా పూజలు చేశారు. ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు హరిహరనాథ్, చంద్రశేఖర్ పర్యవేక్షించారు.

● కరీంనగర్ శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథారటీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి కుటుంబసమేతంగా కొండగట్టు అంజన్నను దర్శించుకున్నారు. ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేయగా ఆలయ అర్చకులు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. ఆలయ పర్యవేక్షకులు హరిహరనాథ్ ఉన్నారు